

RNI NO: APTEL/25/A4894

ఉషశ్రీ
USHASRI తెలుగు దినపత్రిక

RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI తెలుగు దినపత్రిక
సమస్యలతో ఒంటరిగా పోరాడకండి.
సమాచారం - సహకారం -
పరిస్కారం ఒకే చోట సంప్రదించండి
9295003377

సంపుటి : 01 | సంచిక : 80 | విజయవాడ | ఎడిటర్ : ఇలిపిళ్ల మోహన్ | ఆదివారం 31 - 05 - 2026 | పేజీలు : 08 | వెల : రూ.2/-

Published From : Visakhapatnam Vijayawada Guntur Tirupati Kurnool Nellore Rajahmundry Kakinada Anantapur Kadapa Eluru Ongole Srikakulam Vizianagaram Machilipatnam Chittoor

సంస్థలకు భూముల కేటాయింపు

అమరావతిలో 114 సంస్థలకు 1,269 ఎకరాల భూ కేటాయింపు

70 ప్రభుత్వ, 44 ప్రైవేటు సంస్థలకు స్థలాల మంజూరు

మూడు సంస్థలు భూ కేటాయింపులు రద్దు చేసుకున్నాయి

మూడు సంస్థలకు ప్రత్యామ్నాయ స్థలాల కేటాయింపు

సినీ పరిశ్రమ నుంచి ప్రతిపాదనలు ఇంకా రాలేదు

ముంబై సంస్థలు పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నాయి

ఆర్థిక సామర్థ్యం పరిశీలించిన తర్వాతే భూ కేటాయింపు

రైతుల ప్రయోజనాల కోసం రాజధాని పనులు వేగవంతం

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి భూ కేటాయింపులు, నిర్మాణ పనుల పురోగతిపై మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి. నారాయణ కీలక వివరాలను వెల్లడించారు. రాజధానిలో భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతిలో ఇప్పటివరకు మొత్తం 114 సంస్థలకు 1,269 ఎకరాల భూమిని కేటాయించారు. ఇందులో 70 ప్రభుత్వ సంస్థలు, 44 ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. అయితే, ఈ మొత్తం 114 సంస్థల్లో 3 సంస్థలు కొన్ని కారణాల వల్ల తమ కేటాయింపులను రద్దు చేసుకోగా.. మరో 3 సంస్థలకు గతంలో కేటాయించిన స్థలానికి బదులుగా వేరే చోట భూమిని కేటాయించినట్లు మంత్రి వివరించారు. అమరావతిలో స్టూడియోలు లేదా ఇతర సంస్థల స్థాపన కోసం తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రతిపాదనలు రాలేదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. అయితే, ముంబైకి చెందిన కొన్ని ప్రముఖ సినీ, వ్యాపార సంస్థలు అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు, భూముల కోసం ముందుకు వచ్చాయని తెలిపారు. రాజధానిలో భూములు కోరుతూ ముందుకు వచ్చే సంస్థల ఆర్థిక సామర్థ్యాన్ని నిశితంగా పరిశీలించిన తర్వాతే కేటాయింపులు జరుగుతాయని మంత్రి చెప్పారు. అందుకోసం సదరు సంస్థల ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లు, బ్యాలెన్స్ షీట్లను సమర్పించాలని కోరుతున్నట్లు వెల్లడించారు. రాజధాని నిర్మాణ పనులకు ఎలాంటి డీజిల్ కొరత లేదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా భారీ నిర్మాణాలను వాయిదా వేసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించినప్పటికీ.. అమరావతి రాష్ట్ర భవిష్యత్తు, రాజధాని కావడంతో పనులను ఎక్కడా ఆపకుండా కొనసాగిస్తున్నామని

ముందు జెడ్పీటీసీగా పోటీ చెయ్"

రఘురామ, పీవీ సునీల్ కుమార్ మధ్య సవాళ్ల పర్వం

రాజీనామా చేసి తనపై పోటీ చేయాలన్న పీవీ సునీల్ కుమార్

తనను ఛాలెంజ్ చేసే స్థాయి పీవీ సునీల్ కుమార్‌కు లేదన్న రఘురామ

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

డిప్యూటీ స్పీకర్ రఘురామ, సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ పీవీ సునీల్ కుమార్ మధ్య సవాళ్ల పర్వం నడుస్తోంది. రఘురామకృష్ణరాజు తన పదవికి రాజీనామా చేసి, మళ్లీ పోటీ చేయాలని, తాను ఇండిపెండెంట్‌గా పోటీ చేసి రఘురామ కంటే వేయి ఓట్లు తెచ్చుకుంటానని ఛాలెంజ్ చేశారు. ఈ ఛాలెంజులో తాను ఓడిపోతే ఇంకెప్పుడూ రాజకీయాల గురించి మాట్లాడనని.. రఘురామ ఓడిపోతే ఆయన కూడా రాజకీయాల గురించి మాట్లాడకుండా ఉంటారా అని ప్రశ్నించారు. అయితే తనకు ఛాలెంజ్ చేసే స్థాయి పీవీ సునీల్ కుమార్‌కు లేదన్నారు రఘురామ. ఏపీ డిప్యూటీ

హైకోర్టులో ఎదురు దెబ్బ

- ఏపీ హైకోర్టులో ప్రభుత్వానికి చుక్కెదురు
- జీవీఎంసీ, ఎంఎంసీ వార్డుల విభజనపై స్టే
- కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశం

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఏపీ హైకోర్టు విశాఖపట్నం, మచిలీపట్నం మున్సిపల్ కార్పోరేషన్ల వార్డుల పునర్విభజన ప్రక్రియపై స్టే విధించింది. వేర్వేరుగా దాఖలైన రెండు పిటిషన్లపై హైకోర్టు విచారణ జరిపారు.. ఈ పిటిషన్లపై రెగ్యులర్ బెంచ్ వేసవి సెలవుల తర్వాత విచారణ జరుపుతుందని.. వార్డుల పునర్విభజన ప్రక్రియపై అప్పటి వరకు స్టే విధించారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు అదేశించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఏపీ హైకోర్టు లో చుక్కెదురైంది.. ఇటీవల చేపట్టిన వార్డుల విభజన ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. జీవీఎంసీ (గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్)తో

ట్రంప్‌కు మెడికల్ టెస్టులు

- ట్రంప్ పూర్తి ఫిట్‌గా ఉన్నారని వైద్య నివేదిక
- శారీరకంగా, మానసికంగా ఆయన పనితీరు అద్భుతంగా ఉందని వెల్లడి
- గత ఏడాదితో పోలిస్తే 6 కిలోల బరువు పెరిగినట్టు గుర్తింపు
- మేధో సామర్థ్య పరీక్షలో ట్రంప్‌కు 30కి 30 మార్కులు

అంతర్జాతీయం, ఉష శ్రీ

మధ్యంతర ఎన్నికల ముందు ట్రంప్ ఆరోగ్య నివేదికకు ప్రాధాన్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై శ్వేతసౌధం కీలకమైన నివేదికను విడుదల చేసింది. ట్రంప్ 'అద్భుతమైన ఆరోగ్యంతో' ఉన్నారని, కమాండర్ ఇన్

పవన్ కళ్యాణ్ కొత్త ఆలోచన

జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ సందర్శించిన పవన్ కళ్యాణ్

చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి తీరు తెలుసుకున్న డిప్యూటీ సీఎం

గోదావరి పుష్కరాలను కాలుష్య రహిత పుష్కరాలుగా నిర్వహిస్తామని వెల్లడి

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

చెత్త సేకరణ, విద్యుదుత్పత్తి విషయంలో సింగపూర్ మోడల్ ఫాలో అవుతామన్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. పల్నాడు జిల్లాలోని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గోదావరి పుష్కరాలను కాలుష్య రహితంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పుష్కరాలతో సంబంధం ఉన్న 268 పంచాయతీల్లో ప్రత్యేక వర్క్ షాపులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల నుంచి నగరాల వరకు చెత్తను వేరు చేసే ప్రక్రియ మారాలని.. డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా ఏపీ మారాలని పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. కొండవీడు జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా మారుస్తామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. పల్నాడు జిల్లా , కొండవీడులోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటును పవన్ కళ్యాణ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా చెత్త నుంచి విద్యుత్తు తయారీ ప్రక్రియను పరిశీలించి,

సంస్థలకు భూముల కేటాయింపు

చెప్పారు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు ఎంతో నమ్మకంతో తమ భూములను త్యాగం చేశారని, కానీ గత ఐదేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తిగా నిలిచిపోయిందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా పనులను నిలిపివేస్తే రైతులు కోలుకోలేని విధంగా నష్టపోతారని, వారి ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని నారాయణ పేర్కొన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా రాజధాని నిర్మాణాన్ని మరింత వేగవంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

ట్రంప్‌కు మెడికల్ టెస్టులు

చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించడానికి 'పూర్తిగా ఫిట్'గా ఉన్నారని ఆ నివేదిక స్పష్టం చేసింది. మంగళవారం వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో ట్రంప్‌కు వైద్య పరీక్షలు నిర్వహించగా, ఆయన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ సీన్ బార్బబెల్లా ఈ నివేదికను నిన్న విడుదల చేశారు. పరీక్షల అనంతరం ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో స్పందిస్తూ, ప్రతి ఆరు నెలలకు జరిగే తన సాధారణ వైద్య పరీక్షలు పూర్తయ్యాయని, అన్నీ పర్ఫెక్ట్‌గా ఉన్నాయని పేర్కొన్నారు. వైద్య సేవలు అందించిన డాక్టర్లు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమగ్ర వైద్య పరీక్షల్లో భాగంగా 22 మంది నిపుణులు సీటీ స్కాన్, క్యాన్సర్ స్క్రీనింగ్‌లతో పాటు ఇతర పలు పరీక్షలు నిర్వహించినట్లు నివేదికలో పేర్కొన్నారు.

నివేదికలోని ముఖ్యాంశాలు: నివేదిక ప్రకారం ట్రంప్ బరువు 108 కిలోగ్రాములుగా (238 పౌండ్లు) నమోదైంది. గత ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన పరీక్షలతో పోలిస్తే ఇది 6 కిలోలు ఎక్కువ. ఆయన బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 29.7గా ఉంది. వైద్యుల ప్రకారం బీఎంఐ 30 దాటితే ఊబకాయంగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో ఆయన ఆహారం, శారీరక శ్రమ, బరువు తగ్గడంపై వైద్యులు కొన్ని సూచనలు చేశారు. అదే సమయంలో ఆయన మేధో, శారీరక పనితీరు అద్భుతంగా ఉందని నివేదిక స్పష్టం చేసింది. మేధోపరమైన సామర్థ్యాన్ని అంచనా వేసే మాంట్రియల్ కాగ్నిటివ్ అసెస్‌మెంట్‌లో ట్రంప్ 30కి 30 మార్కులు సాధించారు. 2018, 2025లో నిర్వహించిన పరీక్షల్లోనూ ఆయన ఇదే స్కోరు సాధించడం గమనార్హం. మందుల వాడకం వల్ల ఆయన కొలెస్ట్రాల్ స్థాయిలు గణనీయంగా మెరుగుపడ్డాయి. 2018లో 223గా ఉన్న టోటల్ కొలెస్ట్రాల్, ఇప్పుడు 143కి తగ్గింది. ఆయన చేతులపై ఉన్న గాయాలను తరచుగా కరచాలనం చేయడం వల్ల కలిగే సాధారణ సమస్యగా వైద్యులు పేర్కొన్నారు. కాళ్లలో స్వల్ప వాపు ఉన్నప్పటికీ, గతేడాది కంటే పరిస్థితి మెరుగ్గా ఉందని తెలిపారు.

నివేదికకు రాజకీయ ప్రాధాన్యం: వచ్చే నెలలో 80వ పడిలోకి అడుగుపెట్టనున్న ట్రంప్, అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన అత్యంత పెద్ద వయస్కుడిగా రికార్డు సృష్టించారు. ఈ క్రమంలో త్వరలో జరగనున్న మధ్యంతర ఎన్నికలకు ముందు ఆయన ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను చాటిచెప్పే ప్రయత్నంలో భాగంగా ఈ నివేదికకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. ఆయనకు ముందు అధ్యక్షుడిగా ఉన్న డెమొక్రాట్ నేత జో బైడెన్, వయసుపై ఆందోళనల నేపథ్యంలో 2024 అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్ తన శారీరక, మానసిక సామర్థ్యంపై ఎలాంటి సందేహాలకు తావులేదని చాటిచెప్పేందుకు ఈ నివేదిక దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

దాసరి రాము వైసీపీకి అమ్ముడుపోయారు

ఆంధ్రప్రదేశ్: కాపు సంఘం నేత దాసరి రాము వైసీపీకి అమ్ముడుపోయారని జనసేన నేత కిరణ్ రాయల్ ఆరోపించారు. గుంటూరు వైసీపీ సీటు కోసం వారికి అమ్ముడుపోయారని ఆరోపించారు. అందుకే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గురించి ఇష్టానుసారం మాట్లాడుతున్నారని అన్నారు. 2019లో జనసేన ఓడిపోయిన తర్వాత కొంతమంది కాపు నేతలు పార్టీ విడిచి వెళ్లిపోయారని.. వారిలో దాసరి రాము ఒకరని అన్నారు. పవన్ కళ్యాణ్ గురించి ఇష్టానుసారం మాట్లాడితే నాలుక చీరేస్తామంటూ కిరణ్ రాయల్ వార్నింగ్ ఇచ్చారు. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గురించి కాపు సంఘం నేత దాసరి రాము ఇటీవలి కాలంలో కీలక వ్యాఖ్యలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇంటర్వ్యూల సందర్భంగా పవన్ కళ్యాణ్ గురించి, జనసేన పార్టీ గురించి ఆయన చేస్తున్న వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో దాసరి రాము చేస్తున్న వ్యాఖ్యలపై జనసేన తిరుపతి ఇంఛార్జి కిరణ్ రాయల్ స్పందించారు. దాసరి రాము వైసీపీకి అమ్ముడుపోయారని కిరణ్ రాయల్ ఆరోపించారు. పవన్ కళ్యాణ్ , నాదెండ్ల మనోహర్‌ను కించపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ ఓడిపోయిన తర్వాత జనసేన నుంచి కొంతమంది వెళ్లిపోయారన్న కిరణ్ రాయల్.. వారిలో దాసరి రాము కూడా ఉన్నారన్నారు. దాసరి రాము రెడ్ల కనుసన్నల్లో పనిచేస్తూ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని అన్నారు. నాదెండ్ల మనోహర్‌ను టార్గెట్ చేసుకుని మాట్లాడుతున్నారని.. నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. గుంటూరు సీటు కోసం వైసీపీకి దాసరి రాము అమ్ముడుపోయారని కిరణ్ రాయల్ ఆరోపించారు. పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తే నాలుక చీరేస్తామంటూ వార్నింగ్ ఇచ్చారు.కాపు ముసుగులో పవన్ కళ్యాణ్‌ను విమర్సిస్తే బట్టలూడదీసి కొడతామంటూ కిరణ్ రాయల్ ఘాటు హెచ్చరిక చేశారు. మరోవైపు సుగాలి ప్రీతి కేసు విషయంలో న్యాయం చేసింది పవన్ కళ్యాణ్ మాత్రమేనని కిరణ్ రాయల్ అన్నారు. సుగాలి ప్రీతి కోసం లక్షలాదిమందితో సభ పెట్టామని గుర్తు చేశారు. తల్లి, చెల్లిని పట్టించుకోని వైఎస్ జగన్ సుగాలి ప్రీతి సమస్యను పరిష్కరిస్తారా అని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్‌ను విమర్శించేందుకు ఒక టీమ్ సిద్ధమైందన్న కిరణ్ రాయల్.. ఆయనను ఒక కులానికి పరిమితం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎప్పుడు ఇబ్బందులలో ఉన్నా పవన్ కళ్యాణ్ కోట్లు సహాయం చేశారన్నారు. 2019లో జనసేన ఓడిపోయిన తర్వాత కొంతమంది కాపు నేతలు వైఎస్ జగన్ కింద ఊడిగం చేసేందుకు వెళ్లారని.. వారే విమర్శిస్తున్నారని ఆరోపించారు. దెబ్బకు దెబ్బ తీస్తామని.. రివెంజ్ ఖాయమని కిరణ్ రాయల్ హెచ్చరించారు.

పవన్ కళ్యాణ్ కొత్త ఆలోచన

వివరాలను తెలుసుకున్నారు. చెత్తను ఎలా వేరు చేస్తారు.. దాన్ని ప్లాంట్లో ఎలా శుద్ధి చేస్తారు.? దేనికి ఉపయోగిస్తారనే విషయాలను అధికారులు వివరించారు. ముఖ్యంగా చెత్తను బాయిలర్లలో మండించడం ద్వారా విద్యుత్తు తయారీ ఎలా జరుగుతుందో, చివరికి బూడిదను ఇటుకల తయారీకి ఎలా వినియోగించుకోవచ్చో అధికారులు పవన్ కళ్యాణ్‌కు తెలిపారు. ఈ సందర్భంగా ప్లాంటు మొత్తం తిరిగిన పవన్ కళ్యాణ్.. రాష్ట్రంలో రోజువారీగా 7,200 టన్నుల పొడి చెత్త ఉత్పత్తి అవుతోందని అన్నారు. కొండవీడు జిందాల్ ప్లాంటు రోజూ1,400 టన్నుల పొడి చెత్తను ప్రాసెస్ చేసి, సగటున 20 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగలదని వివరించారు. దీనిని రాష్ట్ర విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానం చేసి, రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చగలదని వివరించారు. విశాఖలోనూ జిందాల్ ప్లాంటు ఉత్తరాంధ్ర రీజియన్ చెత్తను సేకరించి 15 మెగావాట్లు విద్యుత్తు ఉత్పాదన చేస్తోందన్న పవన్ కళ్యాణ్.. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహాలో మరో 6 ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కాకినాడలో ఇప్పటికే పనులు మొదలు అయ్యాయని., నెల్లూరు, కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో కూడా త్వరలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. ఇక గోదావరి పుష్కరాలను కాలుష్యరహితంగా నిర్వహించాలనే పట్టుదలతో ఉన్నట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. నదిలో కలుస్తున్న వ్యర్థాలను పూర్తిస్థాయిలో అరికట్టేలా చిత్తశుద్ధితో ప్రణాళికను అమలు చేస్త?మన్నారు. గోదావరి పుష్కరాలకు సంబంధించి 268 పంచాయతీలు ప్రత్యక్షంగా భాగస్వామ్యం అవుతాయని.. నదిలోకి వ్యర్థాలను విడుదల చేయకుండా, నదిని అందంగా, కాలుష్య రహితంగా తీర్చిదిద్దడం మీద ఈ పంచాయతీల అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. సింగపూర్ ప్రజలు ఉపయోగించే కరెంటులో 2.8 శాతం చెత్త నుంచి ఉత్తత్పి అయ్యేదే ఉంటుందని.. సింగపూర్ టాంజాంగ్ టెర్మినల్లో చెత్తను వేరు చేసే ప్రక్రియ చాలా పద్ధతిగా జరుగుతుందన్నారు పవన్ కళ్యాణ్. అలాంటిది విశాఖపట్నం పోర్టులో కూడా మొదలుపెట్టేలా ఆలోచిస్తామని తెలిపారు.రాష్ట్రాన్ని డంపింగ్ యార్డు రహితంగా తీర్చిదిద్దాలంటే వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు మరిన్ని అవసరమని.. ప్రతి 100 కిలోమీటర్లకు ఒక ప్లాంటు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని వివరించారు. పంచాయతీల్లో చెత్త నిర్వహణకు సంబంధించి క్లస్టర్ల వారీగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ప్లాంట్లకు చెత్త ఎలా అవసరం అవుతుంది.? దాన్ని ఎలా వేరు చేయాలి..? సేకరించిన చెత్త ద్వారా పంచాయతీలు ఆదాయం ఎలా పొందవచ్చనే అంశాలపై వర్క్ షాప్ నిర్వహించాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

ముందు జెడ్పీటీసీగా పోటీ చెయ్"

స్పీకర్ రఘురామకృష్ణరాజు , సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా రాజకీయాల్లో పోటీ గురించి ఇద్దరూ సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకున్నారు. రఘురామకృష్ణరాజు తన పదవికి రాజీనామా చేసి.. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని, తాను స్వతంత్ర అభ్యర్థిగా తనపై పోటీ చేస్తానని, రఘురామ కంటే వేయి ఓట్లు ఎక్కువ తెచ్చుకోకపోతే రాజకీయాల గురించి మాట్లాడనని పీవీ సునీల్ కుమార్ ఛాలెంజ్ చేశారు. ఈ సవాల్‌పై వ్యంగ్యంగా స్పందించిన రఘురామ.. తనను ఛాలెంజ్ చేసే స్థాయి సునీల్ కుమార్‌ది కాదన్నారు. "పీవీ సునీల్ కుమార్ సస్పెన్షన్‌లో ఉన్నారు. సస్పెన్షన్‌లోనే రిటైర్ కానున్నారు. ఆయనిప్పుడు రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నారు. అయితే ఎప్పటి నుంచో రాజకీయాల్లోకి ఉన్నట్లుగా నాకు సవాల్ విసురుతున్నారు. నేను రాజీనామా చేస్తే నాపై పోటీ చేసి, వేయి ఓట్ల మెజారిటీతో ఓడించకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటారట. ఆయన కనీసం సర్పంచ్ కూడా కాదు. రాజకీయాల్లో నుంచి తప్పుకోవటం ఏమిటి.. ఆ ఛాలెంజ్‌లు ఏమిటి.. నవ్వుతారు ఎవరైనా.. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. జెడ్పీటీసీగా ఎక్కడైనా నిలబడు. గెలవక్కర్లేదు, కనీసం సరిపడా ఓట్లు తెచ్చుకోగలిగినా.. ఏదో ఒకటి మాట్లాడటానికి కనీస అర్హత ఉంటుంది. ఏమీ లేకుండా స్థాయి మర్చిపోయి, పంచాయతీ సర్పంచ్ స్థాయి కూడా లేని వ్యక్తి.. గతంలో ఎంపీగా గెలిచి, ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న నన్ను ఛాలెంజ్ చేయటమా? ఇలాంటివి చాలు. జెడ్పీటీసీగా పోటీ చేసుకోండి, ఆ తర్వాత చూద్దాం." అంటూ రఘురామకృష్ణరాజు సవాల్ చేశారు.

సునీల్ కుమార్ ఏమన్నారంటే? : "జడ శ్రవణ్ కుమార్, విజయ్ కుమార్ పోటీ చేస్తే వందల్లో ఓట్లు వచ్చాయి. సునీల్ కుమార్ పోటీ చేస్తే 500 ఓట్లు వస్తాయా అని రఘురామ కామెంట్ చేశారు. మీరన్నది నిజమనుకుంటే.. మీ మాట మీద మీకంత నమ్మకం ఉంటే, మీరు రాజీనామా చేయండి. వైసీపీ సహా ఏ పార్టీ నుంచి అయినా పోటీ చేయండి. నేను ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తా. మీకన్నా వేయి ఓట్లు ఎక్కువగా తెచ్చుకోలేకపోతే, నేను మళ్లీ రాజకీయాల గురించి మాట్లాడను. మీరు ఓడిపోతే మళ్లీ రాజకీయాలు మాట్లాడకుండా ఉంటారా. మీ సిద్ధాం "శ్రీకాకుళం జిల్లాలో నాపేరు చెప్పి ఒకాయన ఓపెన్ సీట్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి సర్పంచ్‌గా గెలిచారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఉప ఎన్నికల్లో నా ఫోటోతో తిరిగి ఒకాయన 5 వేలు ఓట్లు తెచ్చుకున్నాడు. ఇవన్నీ మీకు తెలియవేమో.. మీ మాట మీద మీకు నమ్మకం ఉంటే రాజీనామా చేయండి" అని పీవీ సునీల్ కుమార్ ఛాలెంజ్ చేశారు. ఈ వ్యాఖ్యలకే కౌంటర్ ఇచ్చిన రఘురామకృష్ణరాజు.. కనీసం సర్పంచ్ స్థాయి కూడా లేని వ్యక్తి ఛాలెంజ్ విసరడమా అంటూ సెటైర్లు వేశారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసి.. కొన్ని ఓట్లు తెచ్చుకోవాలని.. అప్పుడు ఛాలెంజ్ గురించి ఆలోచిద్దామంటూ పీవీ సునీల్ కుమార్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు రఘురామ.

తిరుమల శ్రీవారికి ఖరీదైన బస్సు విరాళంగా ఇచ్చిన మహిళా భక్తురాలు

ఆంధ్రప్రదేశ్: తిరుమల శ్రీవారికి ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు దర్శించుకుంటారు.. స్వామివారికి కానుకలు, విరాళాలు అందజేస్తుంటారు. కొంతమంది భక్తులు టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ట్రస్టులకు, మరికొందరు వాహనాలు, విలువైన వస్తువుల్ని అందిస్తుంటారు. తాజాగా మరో మహిళా భక్తురాలు భారీ విరాళాన్ని అందజేశారు. తిరుమలలో పర్యావరణ పరిరక్షణకు మరో ముందడుగు వేసేందుకు దాత నీరా రాడియా టీటీడీకి రూ.1.13 కోట్ల విలువైన అత్యాధునిక విద్యుత్ బస్సును అందజేశారు. బస్సుతో పాటుగా దాదాపు రూ.20 లక్షల విలువైన 15 ట్యాబ్‌లను విరాళంగా అందజేశారు. తిరుమల వైకుంఠం క్యూ కాంప్లెక్సు ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌కు ఉపయోగపడేలా ఈ యాపిల్ ట్యాబ్‌లు ఇచ్చారు. తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట బస్సుకు ప్రత్యేక పూజలు చేశారు.. అనంతరం దాత నీరా రాడియా బస్సు తాళం, ట్యాబ్‌లను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. అనంతరం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఇతర అధికారులు దాతలతో కలిసి బస్సులో ప్రయాణించి సామర్థ్యాన్ని పరీక్షించారు. 'తిరుమలలో భక్తులకు మెరుగైన రవాణా సేవలు అందించడంతో పాటు పర్యావరణ హిత కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ఈ విరాళాలు దోహదపడనున్నాయి. ప్రస్తుతం టీటీడీ ధర్మరథ సేవలో 20 బస్సులు ఉండగా, అందులో 14 విద్యుత్ బస్సులు ఉన్నాయి. 21 బస్ స్టాప్‌లలో రోజుకు 380 ట్రిప్పుల ద్వారా భక్తులకు సేవలందిస్తున్నాయి. త్వరలో మిగిలిన డీజిల్ బస్సుల స్థానంలో కూడా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టనున్నాము' అని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. టీటీడీ తరఫున నీరా రాడియాకు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఇందు డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ తలశిల వేంకటేశ్వరరావు తిరుపతిలోని టీటీడీ సెంట్రల్ ఆసుపత్రికి రూ.7.50 లక్షల విలువైన ఔషధాలను విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తరఫున టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు తిరుమలలోని టీటీడీ ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడుకు విరాళాన్ని అందజేశారు. గుంటూరుకు చెందిన డాక్టర్ అన్నం శ్రీనివాస్ శుక్రవారం టీటీడీకి చెందిన శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.15,00,116 విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తరఫున టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అ తిరుమలలో ఆదివారం నాడు మాస పౌర్ణమి గరుడ సేవ నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆదివారం రోజు శ్రీ మలయప్ప స్వామి ఉత్సవ విగ్రహం సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల మధ్య గరుడ వాహనంపై నాలుగు మాడ వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి తన భక్తులను ఆశీర్వదిస్తారు.

హైకోర్టులో ఎదురు దెబ్బ

పాటుగా ఎంఎంసీ (మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్)లలో వార్డుల పునర్విభజన ప్రక్రియపై హైకోర్టు స్టే విధించింది. ఏపీ ప్రభుత్వం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు రెగ్యులర్ బెంచ్ ఈ పిటిషన్‌పై వేసవి సెలవుల అనంతరం విచారణ జరుపుతుందని న్యాయమూర్తి జస్టిస్ తుహిన్‌కుమార్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ హైకోర్టు నిర్ణయంతో వార్డుల విభజన ఆగిపోయింది. విశాఖపట్నానికి చెందిన నరసింహప్రతాప్.. మచిలీపట్నం-ఇనకుదురుపేటకు చెందిన మహ్మద్ ఖలేలుర్ రహ్మాన్‌తో పాటుగా మరికొందరు జీవీఎంసీ, ఎంఎంసీలలో వార్డుల పునర్విభజన ప్రక్రియను ఏపీ హైకోర్టులో సవాల్ చేశారు. అలాగే ఏపీ హైకోర్టులో మరికందరుకూడా పిటిషన్లు దాఖలుచేశారు. శుక్రవారం విచారణ చేపట్టగా పిటిషన్లు లాయర్ల ద్వారా వాదనలు వినిపించారు. దేశవ్యాప్తంగా జనగణన ప్రారంభమైందని.. ఇలాంటి సమయంలో వార్డుల సరిహద్దులు నిర్ణయించడం సరికాదని కోర్టులో వాదనలు వినిపించారు. వార్డుల పునర్విభజనలో అభ్యంతరాలను స్వీకరించకుండా అధికారులు ముందుకెళ్తున్నారని ఆరోపించారు.. ఈ వార్డుల విభజన ప్రక్రియను నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి పరిమితంగా స్టే విధించారు. ఏపీ ప్రభుత్వం జీవీఎంసీ (మహా విశాఖ నగరపాలక సంస్థ)లో వార్డులను 98 నుంచి 120 పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు నగరంలో ప్రజలనుంచి అభ్యంతరాలు, వినతులు స్వీకరించారు. జీవీఎంసీకి ప్రజల నుంచి భారీగా వినతులు వచ్చాయి.. కొంతమంది ఆశ్చర్యకరంగా 120 వార్డులను 150కి పెంచాలని కోరారు. అలాగే ఎంఎంసీ (మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్)లో వార్డుల (డివిజన్ల) సంఖ్యను గతంలో ఉన్న 38 నుంచి 52 కు పెంచుతూ ప్రభుత్వం వార్డుల విభజన ప్రక్రియను పూర్తి చేసింది. అయితే కొంతమంది ఈ వార్డుల విభజనను వ్యతిరేకిస్తున్నారు.. అందుకే ఏపీ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. మరి ఏపీ హైకోర్టు ఈ వార్డుల విభజనపై ఎలాంటి తీర్పు ఇస్తుందో చూడాలి.

మెగా డీఎస్సీ పై వైసీపీ ఆరోపణలు అవాస్తవం

కాకినాడ, మే 30 (ఉష శ్రీ ప్రతినిధి) మెగా డీఎస్సీ విషయంలో వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను మోసం చేసిన వైసీపీకి డీఎస్సీ పై మాట్లాడే హక్కు లేదన్నారు ఐదేళ్లలో వైసీపీ పాలలో ఒక డీఎస్సీ కూడా నిర్వహించలేదని మండిపడ్డారు ఉపాధ్యాయులను అవమానించిన వైసీపీ నేతలు ముందుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల్లో అపోహాలు అలజడి సృష్టించడానికి ఎలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు అన్నారు. వైసీపీ జగన్ మోహన్ రెడ్డి అధికారులు ఉన్నప్పుడు ఒక డీఎస్సీ పోస్ట్ ఇచ్చిన జాడే లేదు జాబ్ క్యాలెండర్ అంటూ నిరుద్యోగులకు యువతని మోసం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. టీచర్లు తమ హక్కుల కోసం ధర్నా చేస్తే తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు లాఠీచార్జిలు చేశారని అంతేకాక టీచర్లను బ్రాందీ షాపు దగ్గర డ్యూటీలకు వేశారని తెలిపారు తన కూటమ పార్టీ డీఎస్సీ ఎక్కువ పోస్టు ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారికి దక్కుతుందన్నారు.

ఏపీలో ద్వంద్వ వాతావరణం.. ఒకవైపు పిడుగులతో వర్షాలు.. మరోవైపు వడగాల్పులు

- రేపు రాయలసీమ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాల హెచ్చరిక
- 17 మండలాల్లో వడగాల్పుల ప్రభావం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

అమరావతి.(ఉషశ్రీ))మే 30: ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం విభిన్నంగా మారుతోంది. ఒకవైపు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉండగా, మరోవైపు కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు, అధిక ఉష్ణోగ్రతలు కొనసాగనున్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపిన వివరాల ప్రకారం, దక్షిణ ఒడిశా నుంచి ఉత్తరాంధ్ర వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. దీని ప్రభావంతో ఆదివారం అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశముందని పేర్కొన్నారు.

కొన్ని జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదు: శనివారం సాయంత్రం 5 గంటల నాటికి అనంతపురం జిల్లా హుస్సేన్‌పురంలో 51 మిల్లీమీటర్లు, కడప జిల్లా పెద్దపసుపల్లెలో 45 మిల్లీమీటర్లు, చిత్తూరు జిల్లా గంగవరంలో 41.7 మిల్లీమీటర్లు, అనంతపురం జిల్లా వెన్నపూసపల్లెలో 31.5 మిల్లీమీటర్లు, కడప జిల్లా ఉప్పలూరులో 29 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

17 మండలాల్లో వడగాల్పుల హెచ్చరిక: మరోవైపు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కొంత తగ్గినా, కొన్ని ప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆదివారం మొత్తం 17 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. మన్యం జిల్లా సీతంపేట, పోలవరం జిల్లా చింతూరు, దేవిపట్నం, కూనవరం, మారేడుమిల్లి, రంపచోడవరం, వరరామచంద్రాపురం, ఏలూరు జిల్లా బుట్టాయగూడెం, పోలవరం, వేలేరుపాడు, కృష్ణా జిల్లా ఘంటసాల, మొవ్వ, గుంటూరు జిల్లా కాకుమాను, పొన్నూరు, బాపట్ల జిల్లా బాపట్ల, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో వడగాల్పుల ప్రభావం ఉండే అవకాశం ఉందన్నారు.

నంద్యాలలో అత్యధిక ఉష్ణోగ్రత: శనివారం నంద్యాల జిల్లా సంజామలలో 41.4 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అనంతపురం జిల్లా హుస్సేన్‌పురంలో 40.2 డిగ్రీలు, కర్నూలు జిల్లా బస్తిపాడు, ప్రకాశం జిల్లా కంభం, వైఎస్సార్ కడప జిల్లా మంగపట్నంలో 40 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రజలకు సూచన: వర్షాలు, పిడుగులు, వడగాల్పులు ఒకేసారి ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. పిడుగుల సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ సమీపంలో నిలబడరాదని అధికారులు సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచించారు

స్నాతకోత్సవానికి ముస్తాబవుతున్న తుమ్మలపల్లి కళాక్షేత్రం

- ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించిన హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్
- పట్టభద్రులు, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు

విజయవాడ, (ఉషశ్రీ)మే 30: డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ 29వ, 30వ స్నాతకోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జరగనున్న స్నాతకోత్సవ కార్యక్రమం నేపథ్యంలో శనివారం సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమ వేదిక, అతిథుల కూర్చునే ఏర్పాట్లు, పట్టభద్రుల ప్రవేశ మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ సదుపాయాలు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.

గవర్నర్ హాజరు నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు: స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్, డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని వైస్ ఛాన్సలర్ సూచించారు.

పట్టభద్రులకు సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి: కార్యక్రమానికి హాజరయ్యే పట్టభద్రులు, వారి కుటుంబ సభ్యులు, అతిథులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేలా ప్రతి అంశాన్ని సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. స్నాతకోత్సవ వేడుకలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయని అధికారులు తెలిపారు.

దేవాదాయ శాఖలో అవినీతి అక్రమాలపై విచారణ జరపాలి

- మంత్రి ఉన్నారా..? కమిషనరే సర్వాధికారా..?
- దేవుడి భూముల ఎన్‌ఓసీలు, ప్రమోషన్లపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేయాలి: కామరాజ్ హరీష్

విజయవాడ, (ఉషశ్రీ)మే 30: రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖలో జరుగుతున్న వ్యవహారాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయని, శాఖ మంత్రి పాత్ర కనిపించకుండా కమిషనర్‌నే సర్వాధికారిగా వ్యవహరిస్తున్న పరిస్థితి నెలకొందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ కుమార్ శనివారం ప్రకటనలో విమర్శించారు. ఆయన దేవాదాయ శాఖలో అవినీతి, అక్రమాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

వందల ఎకరాల దేవాదాయ భూములకు నిబంధనలకు విరుద్ధంగా ఎన్‌ఓసీలు: దేవుడి భూములను, ఆస్తులను కాపాడాల్సిన అధికారులే వాటిని దుర్వినియోగం చేస్తున్నారని హరీష్ ఆరోపించారు. గత 16 నెలల కాలంలో వందల ఎకరాల దేవాదాయ భూములకు నిబంధనలకు విరుద్ధంగా ఎన్‌ఓసీలు మంజూరు చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా మరిన్ని వేల ఎకరాల భూములకు కూడా అనుమతులు ఇచ్చేందుకు ప్రస్తుత కమిషనర్ రామచంద్ర మోహన్ సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోందని విమర్శించారు.

ఒకే వ్యక్తి మూడు కీలక పదవుల్లో కొనసాగుతున్నారన్న ఆరోపణ: దేవాదాయ శాఖ కమిషనర్‌గా, ఏడీసీ-1గా, ఏడీసీ-2గా ఒకే వ్యక్తి బాధ్యతలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని హరీష్ ఆరోపించారు. దీంతో శాఖ పరిపాలన పూర్తిగా గాడితప్పిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆలయాల నిర్వహణలో అనేక లోపాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఆలయాల్లో కైంకర్యాలు సక్రమంగా జరగడం లేదని, దేవతా విగ్రహాల ధ్వంస ఘటనలు జరిగినా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. భక్తులకు అందించే అన్నదాన కార్యక్రమాల్లో కూడా నాణ్యత లోపించి అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు.

మంత్రి ఉనికి కనిపించడం లేదన్న విమర్శ: దేవుడిపై భక్తిశ్రద్ధలు కలిగిన మంత్రి ఉన్నప్పటికీ, శాఖకు సంబంధించిన ప్రతి కార్యక్రమంలో కమిషనర్ మాత్రమే కనిపిస్తున్నారని హరీష్ అన్నారు. మంత్రి పాత్ర ఎక్కడా కనిపించడం లేదని, శాఖను కమిషనరే పూర్తిగా నడుపుతున్నారనే అభిప్రాయం భక్తుల్లో వ్యక్తమవుతోందని పేర్కొన్నారు.

ఉన్నత స్థాయి విచారణ కమిటీ ఏర్పాటు చేయాలి: గత 16 నెలల్లో దేవాదాయ శాఖలో జరిగిన భూముల ఎన్‌ఓసీలు, ఉద్యోగుల ప్రమోషన్లు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉన్నత స్థాయి విచారణ కమిటీని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

పుష్కరాల దృష్ట్యా సమర్థుడైన ఐఏఎస్ అధికారిని నియమించాలి: రానున్న గోదావరి, కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని దేవాదాయ శాఖలో సమర్థవంతమైన పరిపాలన అవసరమని హరీష్ పేర్కొన్నారు. గతంలో గోదావరి పుష్కరాల సమయంలో జరిగిన విషాద ఘటనలను గుర్తు చేస్తూ, అలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా దేవాదాయ శాఖ కమిషనర్‌గా సమర్థుడైన ఐఏఎస్ అధికారిని నియమించాలని కోరారు.

కమిషనర్‌పై న్యాయపరమైన విచారణకు డిమాండ్: ప్రస్తుత కమిషనర్ రామచంద్ర మోహన్‌పై తక్షణమే న్యాయపరమైన విచారణ జరిపించాలని హరీష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే సాధారణ భక్తుడిగా తాను హైకోర్టును ఆశ్రయించి అయినా విచారణ జరిగేలా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. దేవుడి ఆస్తులను దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఏపీలో 'పెద్ది' సినిమాకు టికెట్ ధరల పెంపు

- ప్రత్యేక ప్రీమియర్ షోకు గ్రీన్ సిగ్నల్.. రోజుకు 5 షోలకు అనుమతి
- మల్టీప్లెక్స్‌లలో రూ.125, సింగిల్ స్క్రీన్లలో రూ.100 అదనపు ఛార్జీలు

అమరావతి, (ఉషశ్రీ)మే 30: సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' సినిమాకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక అనుమతులు మంజూరు చేసింది. సినిమా విడుదల సందర్భంగా టికెట్ ధరలను పెంచుకునేందుకు, అలాగే సాధారణ షోల కంటే అదనంగా రోజుకు ఐదు షోలు ప్రదర్శించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, సినిమా విడుదలకు ముందురోజు అయిన జూన్ 3న రాత్రి 8 గంటలకు ప్రత్యేక ప్రీమియర్ షో నిర్వహించేందుకు అనుమతి లభించింది. ఈ ప్రత్యేక ప్రీమియర్ షో టికెట్ ధరను రూ.600గా నిర్ణయించారు. దీంతో అభిమానులు భారీ సంఖ్యలో థియేటర్లకు తరలివచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

10 రోజుల పాటు పెరిగిన టికెట్ ధరలు: సినిమా విడుదలైన రోజు నుంచి 10 రోజులపాటు టికెట్ ధరలను పెంచుకునేందుకు థియేటర్ యాజమాన్యాలకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. మల్టీప్లెక్స్ థియేటర్లలో ఒక్కో టికెట్‌పై రూ.125 అదనంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో టికెట్‌పై రూ.100 అదనంగా వసూలు చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది.

రోజుకు 5 షోలు.. అభిమానుల్లో ఉత్సాహం: సాధారణంగా నాలుగు షోలు మాత్రమే ప్రదర్శించే థియేటర్లకు, ఈ సినిమా కోసం రోజుకు ఐదు షోలు నిర్వహించేందుకు ప్రత్యేక అనుమతి లభించింది. దీంతో మొదటి వారంలో భారీ కలెక్షన్లు నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నిర్మాతలకు ఊరట.. ప్రేక్షకులపై అదనపు భారం: ప్రభుత్వ నిర్ణయంతో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లకు ఆర్థికంగా ప్రయోజనం కలిగే అవకాశం ఉన్నప్పటికీ, మరోవైపు సాధారణ ప్రేక్షకులపై అదనపు భారం పడనుంది. కుటుంబ సమేతంగా సినిమా చూసేందుకు వెళ్లే వారికి పెరిగిన టికెట్ ధరలు గణనీయమైన వ్యయాన్ని మోపనున్నాయని సినీ ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు.

భారీ అంచనాల నడుమ 'పెద్ది': ఇప్పటికే టీజర్లు, పోస్టర్లు, ప్రచార కార్యక్రమాలతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్న 'పెద్ది' సినిమాకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ఇవ్వడం సినీ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. ప్రీమియర్ షో నుంచే సినిమా కలెక్షన్ల జోరు మొదలయ్యే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఘనంగా 57వ సిఐటియు

4 లేబర్ కోడ్స్ రద్దు కోసం పోరాటం ఉధృతం చేస్తాం

కాకినాడ, మే 30 (ఉష శ్రీ ప్రతినిధి): పోరాటాల వేగుచుక్క సిఐటియు 57వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి మధ్య గేటు వద్ద ఉన్న సిఐటియు జండా స్థూపం దగ్గర సిఐటియు జెండాను శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయ్ కుమార్, మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు అనపర్తి ఏడుకొండలు ఎగరవేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1970 మే 30 తేదీన భారతదేశంలో సిఐటియు ఐక్యత, పోరాటం అనే నినాదంతో అవిర్భవించిందని నేటికీ 57 వసంతాలలోకి అడుగుపెడుతుందని అన్నారు. సిఐటియు ఏర్పడిన నాటి నుంచి కార్మిక వర్గం మధ్య ఐక్యత కార్మిక సంఘాల మధ్య ఐక్యత తీసుకురావడం కోసం, కార్మిక హక్కుల సాధన కోసం నిరంతరం అలుపులేని పోరాటాలు ఎన్నో చేస్తుందని భవిష్యత్తులో కూడా కార్మిక హక్కులు సాధించుకోవడానికి మరిన్ని పోరాటాలు చేస్తుందని అన్నారు. 57వ ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని పోరాటం మరింత ఉధృతం చేస్తుందని అన్నారు. అవసరమైతే చలో ఢిల్లీ అయినా వెళ్లి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి నాలుగు లేబర్ కోడ్స్ రద్దు కోసం పోరాటం చేస్తుందని అన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో కనీస వేతనాల సాధన కోసం మరిన్ని పోరాటాలు సాగిస్తుందన్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతనాల సవరణ 2011లో చేసిందని నాటి నుంచి నేటి వరకు అదే వేతనాలకు కార్మికులు పనిచేస్తున్నారని ఈ 15 ఏళ్ల కాలంలో ధరలు విపరీతంగా పెరిగినా వేతనాలు మాత్రం పెంచలేదని తక్షణమే కనీస వేతనాల సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఏళ్ల తరబడి ఏ హక్కులు లేకుండా బానిసలుగా పనిచేస్తున్నారని వెంటనే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను అందర్నీ రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ కోసం, పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి ధరలు తగ్గించాలని భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేయడానికి సిద్ధపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కాకినాడ నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, రమణమ్మ, మంగ, శేషు, రవి, తలుపులమ్మ, సోమరాజు, శ్రీను, బాలరాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్వర అనుమతులతో పారిశ్రామికాభివృద్ధికి వేగం

- 26 క్లెయిమ్‌లకు రూ.3.48 కోట్ల ప్రోత్సాహకాలకు ఆమోదం
- 'ఒక కుటుంబం–ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యంతో ముందుకు సాగుతున్న జిల్లా యంత్రాంగం

విజయవాడ, (ఉషశ్రీ) మే 30: పారిశ్రామిక రంగ అభివృద్ధికి వేగవంతమైన అనుమతులు, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం, ప్రభుత్వ ప్రోత్సాహకాలతో ఎన్టీఆర్ జిల్లాను పారిశ్రామిక అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు సత్వర అనుమతులు జారీ చేస్తూ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన అధికారులకు సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశంలో కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామిక అనుమతులు, ప్రోత్సాహకాలు, వివిధ పారిశ్రామిక చేయూత పథకాల అమలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు.

పారిశ్రామిక ప్రోత్సాహకాలకు గ్రీన్ సిగ్నల్: వివిధ పారిశ్రామిక అభివృద్ధి విధానాల కింద వచ్చిన 26 క్లెయిమ్‌లకు రూ.3.48 కోట్ల విలువైన ప్రోత్సాహకాల మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపినట్లు కలెక్టర్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు అన్ని విధాలా సహకారం అందిస్తోందని, పెట్టుబడిదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక మౌలిక సదుపాయాలు: స్వర్ణాంధ్ర సాధనలో పారిశ్రామిక అభివృద్ధి కీలకమని పేర్కొన్న కలెక్టర్, జిల్లాలోని అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు, ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణానికి శంకుస్థాపనలు పూర్తయ్యాయని తెలిపారు. వాటిని త్వరితగతిన పూర్తి చేసి పారిశ్రామికవేత్తలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

సింగిల్ డెస్క్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి: పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన అన్ని అనుమతుల కోసం సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

'ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యం: ముఖ్యమంత్రి ఆశయమైన 'ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త' కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ వంటి పథకాల కింద వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించి, లబ్ధిదారులు పరిశ్రమలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రైవేట్ పారిశ్రామికవాడలకు పెట్టుబడుల ఆహ్వానం: ప్రైవేట్ రంగంలో పారిశ్రామికవాడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని తీసుకువచ్చిందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆసక్తిగల పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం. మధు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జీ, ఫ్యాప్సియా ప్రతినిధి వాసిరెడ్డి మురళీకృష్ణ, అలెప్ ప్రతినిధి కనకదుర్గ, డీఐఏ ప్రతినిధి ఎం. సుదర్శన్, ఎల్‌డీఎం వెంకటసుబ్బయ్య, డ్రగ్స్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరామ్మూర్తి, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో దొరికిన ఐదుగురు అరెస్ట్

ఆకివీడు:(ఉషశ్రీ) మే 30 గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో 2.60 కిలోల గంజాయిని ఆకివీడు పోలీసులు స్వాధీనం చేసుకుని. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా శనివారం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధికారులు వివరాలు వెల్లడించారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దుంపగడ గ్రామం ఉప్పుటేరు గట్టు వద్ద గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని సీఐ కాళీ చరణ్ అన్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అరెస్ట్ అయిన వారిలో కొందరిపై గతంలోనే గంజాయి, చోరీ, దాడులు, జూదం తదితర కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులు మారేడుమిల్లి లో గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి గంజాయిని తీసుకువచ్చి జిల్లాలో విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 2.60 కిలోల గంజాయి, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు . నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని, గంజాయి విక్రయాలు లేదా రవాణాపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.ఎఈ కేసును ఛేదించిన వారికి రివార్డులు అందజేశారు.అకివీడు సీఐ కాళి చరణ్ , ఎస్సై నాగరాజు , కానిస్టేబుళ్ల బృందాన్ని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి , భీమవరం డీఎస్పీ రఘువీర్ విష్ణు అభినందించారు.

నేరం జరగకముందే అప్రమత్తతే లక్ష్యం

- ప్రజల్లో అవగాహన కోసం 'ఖాకీ స్టూడియో'కు శ్రీకారం
- ఏఐ సాంకేతికతతో సైబర్ నేరాలపై ముందస్తు హెచ్చరికలు

విజయవాడ, (ఉషశ్రీ)మే 30 : సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై సామాన్య ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించడమే ఎన్టీఆర్ జిల్లా పోలీసుల 'ఖాకీ స్టూడియో' ప్రధాన లక్ష్యమని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు తెలిపారు. నేరం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నేరం జరగకముందే ప్రజలను అప్రమత్తం చేయడం అత్యంత సమర్థవంతమైన విధానమని ఆయన పేర్కొన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కూడా కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజల్లో ముందస్తు అవగాహన పెంపొందించేందుకు కమిషనరేట్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నగరంలోని ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్‌ను ఎంపిక చేసి ఐదు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ అందించారు. అనంతరం శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ శిక్షణ పొందిన సిబ్బందితో ముఖాముఖి చర్చించారు. సైబర్ నేరాలు, వివిధ రకాల ఆన్‌లైన్ మోసాలు, ముఖ్యంగా ఓఎల్ఎక్స్ వేదిక ద్వారా జరుగుతున్న మోసాలపై ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలనే అంశాలపై మార్గనిర్దేశం చేశారు.

తక్కువ మాటల్లో ఎక్కువ సందేశం: ప్రజలకు చేరువయ్యే విధంగా, తక్కువ సమయంలో ఎక్కువ సమాచారం అందించేలా అవగాహన కార్యక్రమాలు రూపొందించాలని కమిషనర్ సూచించారు. స్థానిక భాష, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వీడియోలు, సందేశాలు రూపొందించి ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.

ఏఐతో ముందస్తు హెచ్చరికలు : అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఊ×) సాంకేతికతను వినియోగించి సైబర్ నేరాల పట్ల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడం 'ఖాకీ స్టూడియో' ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. అవగాహన ద్వారా నేరాలను నివారించగలిగితేనే సమాజం మరింత సురక్షితంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ కే.జి.సి. సరిత, ఇన్‌స్పెక్టర్లు, శిక్షణ పొందిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆకివీడులో సీఐటీయూ జండా ఆవిష్కరణ

ఆకివీడు : (ఉషశ్రీ) మే 30 సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆకివీడులో శనివారం సీఐటీయూ జెండా ఆవిష్కరణ చేసిన సిఐటియు మండల కన్వీనర్ బొడ్డుపల్లి రాంబాబు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు 1970లో ఆవిర్భవించిందని. అప్పటినుండి ఇప్పటివరకు అనేక కార్మిక ఉద్యమాల్లో ముఖ్య భూమిక పోషించి. దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా అతి ఎక్కువ సభ్యత్వం కలిగిన సంఘంగా ఎదిగిందని అన్నారు. కార్మికులకు ఏ కష్టం వచ్చినా దానిపై నిత్యం పోరాడితూనే ఉన్నది రానున్న రోజుల్లో కార్మికులు జరిపే పోరాటాల్లో ముందుభాగాన ఉండి కార్మి వర్గాన్ని అంతటికి కూడా నాయకత్వం వహిస్తుందని. అన్నారు ఈ కార్యక్రమంలో పెంకి అప్పారావు, బర్నాల అప్పలనాయుడు, పాండు, రమణ,నాగరాజు,భీష్మ తదితరులు పాల్గొన్నారు

120 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

ఆకివీడు: (ఉషశ్రీ) మే 30 పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం దుంపగడప గ్రామంలో ఉన్న వి.వి.గి.రి ప్రభుత్వ కళాశాల నందు నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం ఏప్రిల్ 27న ప్రారంభమై మే 30 వరకు విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ పల్లి లక్ష్మిరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు నైపుణ్యాల అభివృద్ధి కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకోవాలని, జ్ఞానంతో పాటు వివిధ నైపుణ్యాలను కూడా నేర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. క్రమశిక్షణ, కృషి మరియు పట్టుదలతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత స్థానాలను సాధించవచ్చని వారు తెలిపారు.కార్యదర్శి డాక్టర్ పి.బి.ప్రతాప్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా పొందిన నైపుణ్యాలను భవిష్యత్తులో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నెల రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీ నేరేళ్ళ రామ చెంచయ్య , గొంట్ల కృష్ణమూర్తి పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. శిక్షణ అనంతరం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన మొత్తం 120 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది అని అన్నారు.

దుర్గగుడి ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు, ఆమోదాలు

విజయవాడ, ఇంద్రకీలాద్రి, (ఉషశ్రీ)మే 30: ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ఆలయ ఈవో సేన నాయక్, ధర్మకర్త మండలి చైర్మన్ గాంధీ ల నేతృత్వంలో దుర్గగుడి ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆలయ నిర్వహణ, అభివృద్ధి పనులు, టెండర్లు, లీజులు, భూముల వినియోగం, భక్తుల సౌకర్యాల కల్పన వంటి అంశాలపై అజెండాలను ఆమోదానికి సిద్ధం చేశారు.ఈ మేరకు పలు అంశాలకు సంబందించిన వాటిని ఆమోదించారు.

పూల సరఫరా, వస్త్ర ప్రసాదాల టెండర్లకు ఆమోదం: ఆలయంలో నిత్యసేవలు, ఉత్సవాలు, ప్రత్యేక పర్వదినాల సందర్భంగా అవసరమయ్యే పూలు, పూలదండలు, ప్రత్యేక అలంకరణల సరఫరాకు ఎంపికైన టెండరుదారులకు ఆమోదం ఇవ్వాలని ప్రతిపాదించారు. అలాగే భక్తులు, ఉభయదాతలు, ప్రజాప్రతినిధులు, వీఐపీలకు అందించే వస్త్ర ప్రసాదాల సరఫరా కోసం పిలిచిన ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్లను కూడా పరిశీలించారు.

పార్కింగ్ టోల్ హక్కుల వేలం: కొండపై ఘాట్ రోడ్‌తో పాటు కనకదుర్గ నగర్ ప్రాంతంలోని పార్కింగ్ స్థలాల నిర్వహణకు సంబంధించిన లైసెన్స్ హక్కులను ఏడాది కాలానికి ఇవ్వడానికి నిర్వహించిన టెండర్‌లో రూ.2.46 కోట్లకు పైగా అత్యధిక బిడ్ వచ్చినట్లు వెల్లడించారు. దీనికి మండలి ఆమోదం కోరారు.

ఖాళీ డబ్బాలు, సంచుల విక్రయ హక్కులు: దేవస్థానంలోని అన్నదాన, ప్రసాద తయారీ విభాగాల్లో వినియోగించిన ఖాళీ నెయ్యి డబ్బాలు, జీడిపప్పు డబ్బాలు, గోనె సంచులు, ప్లాస్టిక్ సంచుల కొనుగోలు హక్కులను బహిరంగ వేలం ద్వారా ఏడాది కాలానికి కేటాయించే ప్రతిపాదనను కూడా సమావేశం ముందుంచారు.

కొండపై అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్: పాత యాగశాల నుంచి ఆలయ గంట వరకు రిటైనింగ్ వాల్ అభివృద్ధి పనులకు రూ.9.75 లక్షల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే కొండపై వివిధ సివిల్ పనుల నిర్వహణకు రూ.40 లక్షలతో అంచనాలు రూపొందించి ఆమోదం కోరారు.

మహామండపంలో వివాహ సేవలకు లైసెన్స్: మహామండపం ప్రాంగణంలో జరిగే వివాహాలకు అవసరమైన మండపాలు, భోజనాలు, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర సేవలను అద్దెకు అందించే లైసెన్స్ మంజూరు అంశం కూడా సమావేశంలో చర్చకు వచ్చింది.

భక్తుల రవాణాకు ఏసీ మినీ బస్సులు: ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తుల రవాణా కోసం నాలుగు ఏసీ మినీ బస్సుల అద్దె సేవలకు సంబంధించి వచ్చిన లోయెస్ట్ టెండర్లను ఆమోదించేందుకు ప్రతిపాదనలు ఉంచారు.

విద్యుత్ సామగ్రి కొనుగోలుకు రూ.40 లక్షలు: 2026–27 సంవత్సరానికి అవసరమైన ఎలక్ట్రికల్ మెటీరియల్ కొనుగోలుకు రూ.40 లక్షల అంచనాలను ధర్మకర్తల మండలి పరిశీలనకు సమర్పించారు.

దేవస్థానం భూములపై కీలక నిర్ణయాలు: కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న దేవస్థానం భూముల్లో చెట్ల తొలగింపు అనంతరం టెండర్–కమ్–వేలం ద్వారా లీజుకు ఇవ్వాలని ప్రతిపాదించారు. అలాగే మొవ్వ, పునాదిపాడు ప్రాంతాల్లోని దేవస్థానం వ్యవసాయ భూములను మూడు సంవత్సరాల కాలానికి సాగు హక్కులతో లీజుకు ఇవ్వడంపై నిర్ణయం తీసుకోనున్నారు.

గోసంరక్షణ సంఘం భూమి అంశం: కనకదుర్గ నగర్‌లోని గోసంరక్షణ సంఘం స్థల మార్పిడి నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, భూ సేకరణ ద్వారా స్థలాన్ని స్వాధీనం చేసుకునే అంశాన్ని కూడా సమావేశం ముందుంచారు.

భక్తుల సేవలకు 20 మంది సిబ్బంది: కొండపై, కొండకింద ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ కౌంటర్ల నిర్వహణ కోసం అవుట్‌సోర్సింగ్ విధానంలో 20 మంది సిబ్బందిని నియమించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

మరిన్ని అభివృద్ధి పనులు: కనకదుర్గ నగర్ నుంచి మహామండపం వరకు భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులకు రూ.40 లక్షలు, మహామండపం సమీపంలో ఆర్‌సీసీ డ్రెయిన్ నిర్మాణానికి రూ.28 లక్షల అంచనాలు సిద్ధం చేశారు. అలాగే మరుగుదొడ్ల పునరుద్ధరణ, ఎంఎస్ ఆర్చ్ గేట్ల ఏర్పాటు పనులకు వచ్చిన టెండర్ల ఆమోద అంశాలు కూడా సమావేశంలో చర్చకు వచ్చాయి.

భక్తుల సౌకర్యాలే లక్ష్యం: దేవస్థానంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆదాయ వనరులను పెంపొందించడం, ఆలయ మౌలిక వసతులను బలోపేతం చేయడమే ఈ అజెండాల ప్రధాన ఉద్దేశ్యంగా అధికారులు పేర్కొన్నారు.

డ్రైవర్ల దుస్థితి చూసి చలించి పోయిన ఎమ్మెల్యే బొలిశెట్టి....

తాడేపల్లిగూడెం: (ఉషశ్రీ) మే 30 తాడేపల్లిగూడెం సి డబ్ల్యూ సి గోదాముల వద్ద మొక్కజొన్న లోడులతో వచ్చి స్థానికంగా దిగుమతి కాక రోజుల తరబడి నిరీక్షిస్తున్న లారీ డ్రైవర్ల దుస్థితి చూసి తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చలించిపోయారు. వారి దీనస్థితిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు లారీ డ్రైవర్లు విన్నవించుకునేందుకు రాగా ఆయన పరిస్థితిపై సమీక్షించారు. తెలంగాణ నుంచి మొక్కజొన్న లోడుతో వచ్చిన లారీల నుంచి లోడు దిగుమతి చేయకుండా సిడబ్ల్యుసి గోదాముల నిర్వాహకులు వ్యవహరిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం మార్కెట్ అధికారులతో మాట్లాడి వెంటనే మొక్కజొన్న లోడ్ దిగుమతి చేయాలని లేదంటే తానే స్వయంగా లోడు దిగుమతి చేసుకొని వారిని పంపించే ఏర్పాటు చేస్తానని డ్రైవర్లను ఇబ్బంది పెట్టొద్దు అంటూ సూచించారు. డ్రైవర్లకు ఏ సమస్య వచ్చినా నాకు తెలపాలని వెంటనే భోజనం లేక ఇబ్బంది పడుతున్న డ్రైవర్లకు భోజన ఏర్పాట్లను చేశారు. తమ పరిస్థితి చెప్పగానే లోడు దిగుమతి చేసేందుకు అధికారులతో మాట్లాడి తమకు భోజన ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మంచితనానికి లారీ డ్రైవర్లు కృతజ్ఞతలు తెలియజేశారు. తమ సమస్యపై ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి చెల్లించడం తమను ఆశ్చర్యానికి గురి చేసిందని పేర్కొన్నారు.

రామవరప్పాడు ఫ్లైఓవర్ వద్ద బోల్తా పడిన లారీ

విజయవాడ, (ఉషశ్రీ)మే 30: రామవరప్పాడు ఫ్లైఓవర్ సమీపంలో మట్టి లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ మెకానికల్ తప్పిదం తో అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాఫిక్ సీఐ రమేష్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. జేసీబీ సహాయంతో రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన మట్టిని తొలగించగా, క్రేన్‌తో బోల్తా పడిన లారీని రహదారి పక్కకు తరలించారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగకపోవడం ఊరటనిచ్చింది. ఘటన సమయంలో ట్రాఫిక్ పోలీసులు వేగంగా స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో పెద్ద అంతరాయం లేకుండానే వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.

వాహనాల తనిఖీ తప్పనిసరి: ట్రాఫిక్ సీఐ: ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రమేష్ మాట్లాడుతూ, వాహన యజమానులు మరియు డ్రైవర్లు తమ వాహనాలను రోడ్లపైకి తీసుకువెళ్లే ముందు మెకానికల్ పరిస్థితిని తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు. అలాగే రోడ్డు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు సిద్ధమైన యంత్రాంగం

పార్వతీపురం ఉష శ్రీ జ.ఎస్ ఆర్ సహా మూర్తి, మే 30 : జిల్లాలో జూన్ 15 నుంచి ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించనున్న దూతలకు అవసరమైన ప్రత్యేక కిట్లను జిల్లా కలెక్టర్ శనివారం తన ఛాంబర్‌లో పంపిణీ చేశారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు నిర్వహించనున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా దూతలు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు ఈ కిట్లను సిద్ధం చేశారు. ప్రతి కిట్‌లో స్టేషనరీ సామగ్రితో పాటు గొడుగు, వాటర్ బాటిల్ తదితర అవసరమైన వస్తువులను ఒక బ్యాగ్‌లో ఉంచి అందజేశారు. జిల్లాలోని 1,032 మంది దూతలకు ఈ కిట్లను వెంటనే పంపిణీ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు: ఎస్సై కట్టా అనూక్

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేనియెడల కఠిన చర్యలు తీసుకుంటామని పామూరు ఎస్ఐ కట్టా అనూక్ హెచ్చరించారు. శనివారం స్థానిక జాతీయ రహదారిపై జరిగిన వాహన తనిఖీల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... వాహనదారులు తమ ప్రాణాల రక్షణకై హెల్మెట్ ధరించాలని సూచించారు. చాలామంది యువకులు హెల్మెట్ లేకుండా, వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై హెల్మెట్ ధరించని వారిపై మోటార్ వాహన చట్టం ప్రకారం జరిమానాలతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అలాగే, వాహనదారులు అందరూ తమ వెంట డ్రైవింగ్ లైసెన్స్, వాహ న ధ్రువపత్రాలు, (ఆర్ సి ఇన్సూరెన్స్) తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎస్సై తో పాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'యోగాంధ్ర-2026'

- **జూన్ 7 నుంచి 14 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా యోగా ఉత్సవాలు**
- **అమరావతిలో 25 వేల మందితో మెగా ఈవెంట్.. కోటి మంది భాగస్వామ్యమే లక్ష్యం**

అమరావతి, (ఉషశ్రీ)మే 30: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 'యోగాంధ్ర-2026' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. జూన్ 7 నుంచి 21 వరకు 14 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహించి కోటి మందిని భాగస్వాములను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. శనివారం మంత్రులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో యోగాంధ్ర-2026 ఏర్పాట్లపై ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు విస్తృత స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

అమరావతిలో 25 వేల మందితో రాష్ట్ర స్థాయి కార్యక్రమం: జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాజధాని అమరావతిలో 25 వేల మందితో భారీ యోగా కార్యక్రమం నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని కృష్ణా నదిపై నిర్మించిన వెస్ట్ బైపాస్ బ్రిడ్జిపై నిర్వహించనుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అదే రోజు జిల్లా కేంద్రాల్లో వెయ్యి మందితో నిర్వహించే యోగా కార్యక్రమాల్లో మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొనున్నారు.

కోటి మందితో యోగాంధ్ర లక్ష్యం: యోగాంధ్ర కార్యక్రమాన్ని గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహిస్తూ కోటి మందిని భాగస్వాములను చేయడానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న 1.50 లక్షల మంది యోగా ట్రైనర్లకు అదనంగా మరో లక్ష మందికి శిక్షణ ఇచ్చి యోగా ప్రచారాన్ని విస్తృతం చేయనున్నారు.

'ఒక జిల్లా - ఒక థీమ్'తో 14 రోజుల కార్యక్రమాలు: రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ప్రత్యేక థీమ్‌తో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లాల వారీగా యోగా ఉత్సవాల నిర్వహణకు రూ.25 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు.

టూరిస్టు ప్రాంతాలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక యోగా సెషన్లు: ఆరోగ్య, మానవ వనరులు, మున్సిపల్, పంచాయతీరాజ్, దేవాదాయ, ఐటీ శాఖల సమన్వయంతో కార్యక్రమాలు చేపట్టనున్నారు. రాష్ట్రంలోని 56 ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక యోగా సెషన్లు నిర్వహిస్తారు. అలాగే పార్కులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డుల్లోనూ యోగా కార్యక్రమాలు జరగనున్నాయి.

యోగాపై ప్రత్యేక వీడియోలు అందుబాటులోకి: రాష్ట్ర ప్రభుత్వ యోగా, నాచురోపతి విభాగ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు రూపొందించిన యోగాంధ్ర-2026 పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. యోగాసనాలు, ప్రాణాయామం, ఆరోగ్య సమస్యల నివారణకు సంబంధించిన 90 ఆసనాల వీడియోలు, ప్రత్యేక శిక్షణ వీడియోలను ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

ఉత్తమ ప్రదర్శనకు అవార్డులు: యోగాంధ్ర కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాలు, రాష్ట్ర స్థాయి సంస్థలకు ప్రత్యేక అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. యోగాంధ్ర-2026 ద్వారా యోగాను ప్రజల జీవనశైలిలో భాగం చేసి ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

కార్మిక హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలను అరికడదాం

- **సిఐటియు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు**
- **పార్వతీపురం మున్సిపల్ కార్మికులు జండా ఆవిష్కరణ**

పార్వతీపురంఉష శ్రీ జ.ఎస్ ఆర్ సిహెచ్ మూర్తి,మే30:- దేశ కార్మిక వర్గ హక్కుల సాధన కోసం, శ్రమజీవుల సంక్షేమం కోసం, కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం నిరంతరం సిఐటియు పోరాడుతుందని సిఐటియు నాయకులు అన్నారు. శనివారం సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) 56 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సమస్త కార్మికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా పార్వతీపురం పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు, కళాసీ, ఆటో స్టాండ్ వద్ద సిఐటియు జెండాలు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ 1970 మే 30న స్థాపించబడిన సిఐటియు, దేశంలోని కార్మిక వర్గానికి అండగా నిలుస్తూ వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలను విజయవంతంగా నడిపిందనీ అన్నారు. అసంఘటిత రంగ కార్మికులు, నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిరంతరం కృషి చేస్తోందనీ తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కార్మిక చట్టాల పరిరక్షణ, ప్రజా రంగ సంస్థల రక్షణ, కార్మికుల జీవన హక్కుల సాధన కోసం మరింత ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందనీ కొనియాడారు. నాలుగు లేబర్ అమలు చేస్తూ బిజెపి కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని అన్నారు. పని గంటలు పెంచుతూ వేతనాలు తగ్గిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తుందని అన్నారు. కార్పొరేట్ల కోసం కార్మికులను కట్టు బానిసలుగా చేస్తున్న బిజెపి విధానాలను ప్రజలందరూ తిప్పి కొట్టాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికులపై ధమనకాండం విధిస్తుందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో సిఐటియు ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ కార్మికులందరూ సంఘటితమై తమ హక్కుల సాధన కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పార్వతిపురం కార్యదర్శి సిహెచ్ సింహాచలం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, ఆటో యూనియన్ నాయకులు సింహాచలం కృష్ణ, కళాసి యూనియన్ నాయకులు భానుమూర్తి, జి.కృష్ణ, మున్సిపల్ కార్మికులు రవి, వరదరాజు, శంకర్రావు, ఎం.శివా, సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ, పారిశుధ్యానికే ప్రథమ ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి పార్వతీపురం ఉష శ్రీ ప్రతినిధి జి ఎస్ ఆర్ సి హెచ్ మూర్తి, మే 30: జిల్లాలోని చెరువుల పరిరక్షణ, మురుగునీటి కాలువల ఆధునీకరణ మరియు ప్రజా ఆరోగ్య రక్షణే ధ్యేయంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక శివాలయం చెరువు వద్ద ముమ్మరంగా సాగుతున్న 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' పనులను, నూతనంగా అందుబాటులోకి వచ్చిన వాకింగ్ ట్రాక్‌ను శనివారం నాడు పరిశీలించారు. ?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి గారు మున్సిపల్ అధికారులతో మాట్లాడి పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ?జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని జనావాసాలు, చెరువుల పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలి. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' లో భాగంగా శివాలయం చెరువు పక్కనే ఉన్న డ్రైన్లు, స్టామ్ వాటర్ డ్రైన్లు (వరద నీటి కాలువలు) మరియు నాలాల్లో పూడికతీత పనులను ముమ్మరం చేయించాం. వర్షాకాలం రానున్న నేపథ్యంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా, మురుగునీరు సజావుగా సాగిపోయేలా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలోని చెరువులు, కాలువలు, ఇతర జల వనరుల పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాల మట్టాలు పడిపోకుండా వర్షపు నీటిని సక్రమంగా సంరక్షించుకోవాలని సూచించారు. చెరువుల ఆక్రమణలను నివారించడం, నీటి వనరుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చన్నారు. జల వనరుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నిర్వహించిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో స్థానికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు. శివాలయం చెరువు వద్ద ప్రజల ఆహ్లాదం, ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించిన కలెక్టర్, దీనిని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పారిశుధ్య పనులు, డ్రైన్ల క్లీనింగ్ నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడా నిర్లక్ష్యం వహించకూడదని మున్సిపల్ కమిషనర్ మరియు సిబ్బందిని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో మునిసిపల్ కమిషనర్ పావని, మెప్మా పి. డి నాగభూషణ రావు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ కమిటీ మన్యం జిల్లా ప్రెసిడెంట్ వారణాసి శ్రీహరి మరియు ప్రముఖ న్యాయవాది టి.జోగరావు,కౌన్సెలర్ బడే గౌరి నాయుడు, సభ్యులు, మున్సిపాలిటీ, సచివాలయ అధికారులు, సిబ్బంది, వార్డ్ ప్రజలు ఉన్నారు.

గూగుల్ డేటా సెంటర్ కు నీరు, విద్యుత్తు ఏ విధంగా సమకూరుతుంది?

- సెంటర్ ఫర్ లిబర్టీ అధ్యక్షుడు నలమోతు చక్రవర్తి
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం....

విశాఖపట్నం, ఉష శ్రీ: విశాఖలో ఏర్పాటు చేయబోయే గూగుల్ డేటా సెంటర్ కు అత్యంత కీలకమైన నీరు, విద్యుత్తు ఏ విధంగా సమకూరుతుందో కూటమి ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని.. సెంటర్ ఫర్ లిబర్టీ అధ్యక్షుడు నలమోతు చక్రవర్తి అన్నారు. తెలుగు శక్తి ఆధ్వర్యంలో శనివారం ఉదయం.. ఉత్తరాంధ్ర సమస్యలు, అభివృద్ధి పై మేదోమథన సమ్మేళనం నిర్వహించారు. హోటల్ మేఘాలయ వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నల్లమోతు చక్రవర్తి మాట్లాడుతూ.. విశాఖ నగర అవసరాలకు ప్రస్తుతం వినియోగిస్తున్న విద్యుత్తును గూగుల్ డేటా సెంటర్ కు తరలిస్తారా..? లేదా గూగుల్ డేటా సెంటర్ స్వయంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తుందా..? తెలపాలన్నారు. అదే విధంగా నగర ప్రజలు అవసరాలకు ఉపయోగిస్తున్న నీటిని గూగుల్ కు మళ్లిస్తారా..? లేదా డి సాలినేషన్ పద్ధతిని గూగుల్ వినియోగించుకుంటుందా?మొదలైన విషయాలపై ప్రభుత్వం స్పష్టత చేయవలసిన అవసరం ఉందన్నారు. గూగుల్ డేటా సెంటర్ వల్ల కాలుష్యం ముప్పు లేదని పేర్కొన్న చక్రవర్తి.. ఉపాధి అవకాశాల కోసం మాట్లాడుతూ.. గూగుల్ డేటా సెంటర్ వల్ల ప్రత్యక్షంగా 1000 నుంచి 1500 ఉద్యోగాలు ప్రత్యక్షంగా లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా గూగుల్ డేటా సెంటర్ నిర్మాణ సమయంలోను, సముద్రం లోపల కేబుల్ నిర్మాణం మొదలైన రంగాలలో ఉపాధి అవకాశాలు పరోక్షంగా లభించే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉండగా సుమారు 450 లక్షల కోట్ల సామర్థ్యం కలిగిన గూగుల్ డేటా కు ప్రభుత్వం 20,000 కోట్లు రాయితీ ఇచ్చే అంశాలపై వ్యతిరేకించారు. అంత పెద్ద భారీ సంస్థకు రాయితీ ఇవ్వవలసిన అవసరం ఏముందని ప్రశ్నించారు. విశాఖలోని గతంలో లులు సహా వివిధ ప్రైవేట్ రంగ సంస్థలకు కారు చౌకకే భూములు కట్టబెట్టిన విషయాన్ని మర్చిపోకముందే సత్వ అనే రియల్ ఎస్టేట్ సంస్థకు ఎకరా కోటి 50 లక్షలు చొప్పున 30 ఎకరాలను అప్ప చెప్పడం పట్ల కూడా చక్రవర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల సొమ్మును, ప్రజల అవసరాలకు ఉపయోగించాల్సిన భూమిని ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం సరికాదని చక్రవర్తి అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం ఉందని చక్రవర్తి అభిప్రాయపడ్డారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఏదో చేస్తుందని ప్రజలు ఆ పార్టీని గద్దెనెక్కిస్తే.. ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. వైసిపి వల్ల ఉపయోగం లేదని తెలుసుకున్న ప్రజలు కూటమి పార్టీలను గెలిపిస్తే.. కూటమి ప్రభుత్వం కూడా వైసిపి ప్రభుత్వం మాదిరిగానే వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయం పార్టీలు రావాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయం చేశారు. దివంగత నందమూరి తారక రామారావు మినహా మిగిలిన రాజకీయ పార్టీల నాయకులు అందరూ కూడా ప్రజలను ప్రజలుగా గుర్తించడం లేదని.. ఉచిత పథకాల పేరుతో వారిని బిచ్చగాళ్ళుగా మారుస్తున్నారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఓట్ల కోసం ప్రజలను ప్రజలుగా గుర్తిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నమ్మి అప్పలరాజు యాదవ్, పెద్దాడ రమణ, డాక్టర్ పప్పూరు నికుంజ్, పెంట త్రినాథరావు, భారీ సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగులు ధ్వంసం చేసిన పంటకు పరిహారం ఇవ్వండి

- రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు సహకరించాలి
- ఏనుగుల బెడద నుండి జిల్లాకు విముక్తి కలిగించండి
- ప్రజలు ప్రాణాలు పోతున్నా, కోట్లాది ఆస్తులు ధ్వంసం అవుతున్నా పట్టని పాలకులు
- కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు

పార్వతీపురం ఉష శ్రీ జి.ఎస్ ఆర్ సిహెచ్ మూర్తి మే30:- జిల్లాలో ఏనుగులు ధ్వంసం చేస్తున్న రైతుల పంటలకు పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ బీసీసీ జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు కోరారు. శనివారం ఇటీవల సోమలింగాపురం రెవిన్యూ పరిధిలో ఏనుగుల దాడిలో పొలంలో పంట, మోటార్లు, పైపులు ఫెన్సింగ్ నష్టపోయిన రైతుకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22, 23, 24 తేదీలలో కొమరాడ మండలం, విక్రమపురం పంచాయతీ, సోమలింగాపురం రెవిన్యూ లో ఏనుగులు గుంపు ప్రవేశించి రైతుల పంట పొలాలను ధ్వంసం చేశాయన్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా ఫారెస్ట్ కార్యాలయ అధికారి ఆర్. దేవ ప్రసాద్ వినతి పత్రాన్ని అందజేశారు. పరిహారం చెల్లించే విధానంలో రైతులకు ఇబ్బంది పెట్టకుండా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా డిసిసి వంగల దాలి నాయుడు మాట్లాడుతూ దాదాపు గత ఎనిమిదేళ్లగా పార్వతీపురం మన్యం జిల్లాని ఏనుగులు గజగజలాడిస్తున్నాయన్నారు. ఇప్పటివరకు దాదాపు 12 మంది వ్యక్తులను పొట్టన పెట్టుకోగా, సుమారు 6 కోట్ల మేర ఆస్తులు ధ్వంసం చేశాయన్నారు. ఏనుగులు నిత్యం జిల్లాలో సంచరిస్తూ జిల్లా ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. ఏనుగుల ఎప్పుడు ఏ ప్రాంతానికి వస్తాయో తెలియని భయంతో రైతులు పొలాలకు ధైర్యంగా వెళ్లే పరిస్థితి కూడా లేదన్నారు. ఏనుగులు తిరిగాడే ప్రాంతాలలో ప్రజలు రోడ్డుపైకి వచ్చేందుకు భయపడుతున్నారన్నారు. ఇంత జరుగుతున్న పాలకులు కనీసం పట్టించుకోలేదన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కుంకి ఏనుగులు పంపిస్తారన్న ఆశతో ఎదురు చూస్తున్న ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు. సీతానగరం మండలంలో ఏనుగులకు విడిది ఏర్పాటు ఇప్పటికీ కొలిక్కి రాలేదన్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నా, రైతుల కోట్లాది రూపాయల ఆస్తులు ధ్వంసం అవుతున్నా పాలకులు మాత్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ముమ్ముందు ఏనుగుల వలన జరగరాని నష్టం జరగకముందే ఏనుగుల బెడద నుండి జిల్లా ప్రజలకు విముక్తి కలిగించాలని కోరారు.

ఇల వైకుంఠం లా మారిన శ్రీ గోదాదేవి, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం

- కలియుగ వైకుంఠం తిరుమలను తలపిస్తున్న శ్రీ గోదాదేవి పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం
- ఇలలోకి దిగివచ్చి భక్తులను ఆశీర్వదిస్తున్న కలియుగ వైకుంఠ వాసుడు శ్రీనివాసుడు

ఉష శ్రీ వరికుంటపాడు ఉదయగిరి ప్రతినిధి బాలు : పామూరు, వరికుంటపాడు మండలాల్లో ఎక్కడా లేని విధంగా సువిశాలమైన ప్రాంగణంలో జాతీయ రహదారికి ఆనుకొని వరికుంట పాడు వద్ద (వైకుంటపురం) పెండ్యాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ గోదాదేవి పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తుల పాలిట కొంగు బంగారంగా, ఆపదల నుంచి కాపాడే ఆపద మొక్కులవాడిగా నిత్య దూప దీప నైవేద్యాలతో దేదీప్యమానంగా శ్రీనివాసుడు పూజలు అందుకుంటున్నాడు.

ఏడుకొండల వాడిని భక్తుల దరి చేర్చిన పెండ్యాల వారు: కలియుగ వైకుంఠం తిరుమల ఏడుకొండల స్వామిని భక్తుల చెంతకు చేర్చిన శ్రీ గోదాదేవి పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ దంపతులు. పామూరు లాంటి పెద్ద పట్టణంలో కూడా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం లేని భక్తులకు తీర్చిన పెండ్యాల లోటు సూర్యనారాయణ దంపతులు.

జాతీయ రహదారికి ఆనుకొని ఉండటంతో మెరుగైన రవాణా సౌకర్యం : శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం జాతీయ రహదారికి అనుకొని ఉం డడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. అందువలన భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కూడా ఉండడంతో భక్తులు విరివిగా ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

వేల మంది భక్తులకు అన్న ప్రసాదం అందజేస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు: ప్రతి శనివారం మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారిని దర్శించుకునే ప్రతి భక్తుడికి అన్న ప్రసాదం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందించడం జరుగుతుంది. ఎంతోమంది భక్తులు అన్న ప్రసాదానికి భారీగా విరాళాలు అందిస్తూ ఉంటారు. భక్తులకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేస్తూ మినరల్ వాటర్ ప్లాంట్ ను కూడా ఒక దాత ఏర్పాటు చేసి ఉన్నాడు.

చెరువు కట్టపై జంగిల్ క్లియరెన్స్ పనులు పరిశీలించిన మార్కెట్ కమిటీ చైర్మన్ యారవరమా శ్రీనివాసులు

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ ఒంగోలు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలకు పామూరు మండలంలోని పడమర కట్ట కింద పల్లి గ్రామంలో చెరువు కట్ట పై చేపట్టిన క్లియరెన్స్ (చెత్త చెదారం, ముళ్ళ పొదలు తొలగింపు) పనులను కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యార వ రమ శ్రీనివాసులు శనివారం స్వయంగా పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో చెరువు కట్ట కు ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా మరియు స్థానికులకు ఇబ్బంది లేకుండా ఈ పనులను వేగ వంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. చెరువు కట్టపై పేరుకో పోయిన గుర్రపు డెక్క, తుమ్మ చెట్లు, ఇతర పిచ్చి మొక్కలను జె సి బి లు, కార్మికుల సహాయంతో తొలగిస్తున్న తీరును చైర్మన్ పరిశీలించారు. కట్ట ప్రాంతంలో ఎక్కడ మట్టి కోతకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, పనుల్లో నాణ్యత, వేగం ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజల రక్షణ సౌక ర్యార్థం ఈ పనులను అత్యవసరంగా చేపట్టినట్లు తెలిపారు. వర్షాలు పడే లోగా ఈ పనులన్నీ పూర్తి చేసి, చెరువు కట్టను సురక్షితంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమైక్యతకు ప్రతీక: పడమర కట్ట పల్లి గ్రామంలో పోలేరమ్మ, అంకాలమ్మ నూతన దేవాలయ నిర్మాణానికి శ్రీకారం

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ భక్తిశ్రద్ధలకు నిలయమైన పడమర కట్టకిందపల్లి లో గ్రామ దేవతలైన శ్రీ పోలేరమ్మ, శ్రీ అంకాలమ్మ నూతన దేవాలయాల నిర్మాణానికి గ్రామస్తులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన (అంచనా వ్యాయం సుమారు 15 నుండి 20 లక్షల రూపాయలు) వరకు గ్రామ కమిటీ సభ్యులు అంచనా వేశారు. ఆలయ గర్భగుడి, ముఖ మండపం, మరియు అమ్మ వాళ్ళ దగ్గర ప్రతిష్టాపన కోసం ఈ నిధులను ఉపయోగించమన్నారు. ఈ పవిత్ర కార్యంలో ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలని గ్రామ కమిటీ పిలుపునిచ్చింది. గ్రామస్తులు, దాతలు మరియు దూర ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామ సంతతి వారు తమ శక్తి కొలది అందించాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమ శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్య లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవించిన గర్భిణీ.

ఉష శ్రీ ప్రతినిధి సీతారామపురం మండలం (మే 30) మండలంలోని పబ్బలేటిపల్లి ఎస్టి కాలనీకి చెందిన పామూరు .నాగూరమ్మ అనే గర్భిణి స్త్రీ ప్రసవ వేదనతో సీతారాంపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శనివారం సాయంత్రం రావడం జరిగింది. ఆమె పరిస్థితిని పరిశీలించిన స్థానిక డాక్టర్లు డెలివరీ చేయటం వీలుపడదు అనడంతో 108 అంబులెన్స్ లో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .ఈ తరుణంలో మార్గమధ్యంలో బసినేనిపల్లి గ్రామ సమీపానికి రాగానే తీవ్ర నొప్పులతో గర్భిణీ స్త్రీ మగ బిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది అత్యవసర సేవలు అందించి సురక్షితంగా ప్రసవం చేయడం జరిగింది. తల్లి శిశువు ఇద్దరూ సురక్షితంగా ఉన్నారు. అనంతరం వారిని ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో వైద్య సేవలు అందించారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించిన 108 సిబ్బంది అయిన ఈఏంటి వెంకట శ్రీనివాసులు, పైలెట్ మధు సేవలను కుటుంబ సభ్యులు అభినందించారు.

పెంచలకోన శ్రీలక్ష్మి నరసింహస్వామి దర్శించుకున్న బైరెడ్డి, దారప నేని

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన పెంచలకోన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని మాజీ కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దారపునేని శేఖర్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బైరెడ్డి జయరాం రెడ్డి విచ్చేసి శనివారం భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దారపునేని శేఖర్ మాట్లాడుతూ... ప్రకృతి ఊరిలో వెలసిన ఈ మహి మాన్వితమైన క్షేత్రన్ని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని, స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్టు తెలిపారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు మరియు వేద పండితుల ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదలను అందజేసి, వేద మంత్రోచ్ఛ రుణాలతో ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దారపునేని శేఖర్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, తూర్పు కోడిగుడ్లపాడు టిడిపి నాయకులు దారప రాజేంద్రప్రసాద్, పోతవరం గ్రామ టిడిపి నాయకులు మిరియం సుబ్బారాయుడు, నిశ్చితా ఫిషర్ మెన్ సొసైటీ మాజీ అధ్యక్షులు కవులూరి ఖాజా రహమతుల్లా, జాజం హరికృష్ణ పాల్గొన్నారు

కదిరి నూతన ఆర్డీవో కళావతి ని మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపిన తహసీల్దార్లు

కదిరి (ఉష శ్రీ) మే 30 పట్టణంలోని రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నూతన ఆర్డీవో గా బాధ్యతలు స్వీకరించిన కళావతిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శు భాకాంక్షలు తెలిపిన నంబులపూలకుంట తహసిల్దార్ దేవేంద్ర నాయక్, కదిరి తహసిల్దార్ రెడ్డి శేఖర్, తదితరులు ఉన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్

ధర్మవరం (ఉష శ్రీ) మే 30 పట్టణంలోని మార్కెట్ యార్డులోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈ నెలవారీ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల భద్రత విషయంలో రాజీ పడకూడదని, 24/7 పటిష్టమైన నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. గోడౌన్ వద్ద భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, ధర్మవరం తహసీల్దార్ సురేష్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వరయ్య మరియు వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్ అంటూ కదిరి వీధుల్లో మహిళల జయహో ర్యాలీ

కదిరి(ఉష శ్రీ) మే 30 తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మహానాడులో మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తూ ప్రకటించిన చారిత్రాత్మక నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ, కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం కదిరిలో మహిళలు భారీ కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. కదిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని, థ్యాంక్యూ సీఎం సార్, థ్యాంక్యూ లోకేష్ సార్, థ్యాంక్యూ కందికుంట అన్న అంటూ ప్లేకార్డులు ప్రదర్శించారు. మహిళా సాధికారతకు, రాజకీయాల్లో మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించే దిశగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మహిళలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు కల్పించే ఈ నిర్ణయం చారిత్రాత్మకమని, భవిష్యత్ తరాల మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ర్యాలీ మొత్తం కృతజ్ఞత నినాదాలతో మార్మోగింది.

ఘనంగా మహాదేవేశ్వర స్వామి వారి పౌర్ణమి పూజోత్సవం

తవణంపల్లె (ఉష శ్రీ) మే30 మండలంలోని ఎగువ మారేడు పల్లి గ్రామంలో వెలసిన మహాదేవేశ్వర స్వామి వారి ఆలయంలో పౌర్ణమి పూజోత్సవం భక్తుల భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మృత్యుంజయ మహా మంత్ర ఘోషతో పాటు ఓం నమ శ్శివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమంలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు. ఇందులో భాగంగా స్వామివారికి అభిషేకం నిర్వహించి, అనంతరం చందన అలంకరణ చేశారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ విశేష కార్యక్రమనికి ఉభయదారులుగా తిరుపతి వాస్తవ్యులు సందీప్ మరియు వారి సతీమణి సుజాత వ్యవహరించారు. గ్రామ ప్రజలు,శివ భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని శివానుగ్రహం పొందా

జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ అంశాలపై విస్తృతస్థాయి సమావేశం

అనంతపురం (ఉష శ్రీ) మే 30 అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ అధ్యక్షతన జిల్లా స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్థిక ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, సామాజిక సంక్షేమం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. స్థాయి సంఘం-1లో ఆర్థిక మరియు ప్రణాళిక అంశాలను సమీక్షించగా, స్థాయి సంఘం-2లో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. స్థాయి సంఘం-3లో వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలు, స్థాయి సంఘం-4లో విద్యా మరియు వైద్య సేవలు, స్థాయి సంఘం-5లో మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాలు, స్థాయి సంఘం-6లో సంక్షేమ పథకాల అమలు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో నార్పల, బుక్కరాయ సముద్రం మండలాలకు సంబంధించిన తాగునీరు, డ్రైనేజీ, బోరుబావుల సమస్యలను జిల్లా పరిషత్ సభ్యుడు చంద్ర ప్రస్తావించారు. దీనిపై అధికారులు స్పందించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వ్యవసాయ అంశాలపై జిల్లా పరిషత్ సభ్యులు చంద్ర, నాగరాజు పంటల పరిస్థితి, అరటి, దానిమ్మ, వేరుశెనగతో పాటు ఇతర పంటల సాగుపై ప్రశ్నలు అడగగా, జిల్లా వ్యవసాయ అధికారులు సమగ్ర వివరాలు అందించారు. రైతులకు ప్రతిరోజూ పంటల నిర్వహణ, మందుల వినియోగం, మార్కెట్ ధరల సమాచారం అందించేందుకు సమాచార బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమను కూడా ఆ బృందంలో చేర్చాలని సభ్యులు కోరారు. విద్యా శాఖ తరఫున జిల్లా విద్యాశాఖ అధికారి, వైద్య శాఖ తరఫున అనంతపురం మరియు సత్యసాయి జిల్లాల జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సభ్యుడు చంద్ర మాట్లాడుతూ అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు సరిపడా భోజనం అందడం లేదని, వందలాది మంది రోగులకు తక్కువ పరిమాణంలో ఆహారం సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్య అధికారి స్పందిస్తూ కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఇకపై ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన కొత్త భవనాల నిర్మాణం ఇప్పటికీ పూర్తికాకపోవడంతో అనేక కేంద్రాలు అద్దె భవనాలు, రేకుల షెడ్లు, తాత్కాలిక గదుల్లో కొనసాగుతున్నాయని సభ్యులు ప్రస్తావించారు. పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరగా, అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సామాజిక సంక్షేమ శాఖ సమీక్షలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులాలు, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, ఎస్టీ పాఠశాలల పనితీరును సమీక్షించారు. గత ఏడాది 60 శాతం ఉన్న పదో తరగతి ఉత్తీర్ణత ఈ ఏడాది 70 శాతానికి పెరిగినట్లు అధికారులు తెలిపారు. బీసీ పాఠశాలల్లో 79 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో భోజన నాణ్యత సరిగా లేదని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గుత్తి ఎస్టీ వసతి గృహంలో ఓ విద్యార్థిని ఎలుకలు కరిచిన ఘటనను ప్రస్తావించగా, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆదేశించారు. విద్యుత్ సరఫరా అంశంపై గిరిజమ్మ మాట్లాడుతూ రైతులకు నిరంతరాయంగా విద్యుత్ అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గార్లదిన్నె మండలంలో విద్యుత్ సమస్యల కారణంగా ఒక రైతు తన ఎండిపోయిన పంటను ట్రాక్టర్‌తో దున్నివేయాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు స్పందిస్తూ రైతులకు సౌర విద్యుత్ పథకాల కింద ప్రభుత్వం భారీ రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు. ఒక యూనిట్‌కు రూ.30 వేల వరకు, రెండు యూనిట్లకు రూ.60 వేల వరకు రాయితీ లభిస్తుందని, సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీ అందుబాటులో ఉందని వివరించారు.

కేఎన్ఆర్ ఆస్తులపై సిట్ దర్యాప్తు మరిన్ని నిజాలు వెలుగులోకి

తవణంపల్లె (ఉష శ్రీ) మే 30 దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లిక్కర్ స్కామ్ లో జగన్మోహన్ రెడ్డి పిఎ కె నాగేశ్వర్ రెడ్డి అలియాస్ కే ఏన్ ఆర్ వందల కోట్ల రూపాయలు తన పేరు మీద, తన భార్య పేరు మీద సంపాదించింది. ఒక సాధారణ జర్నలిస్టుగా ఉన్న కేఎన్ఆర్ అక్రమ ఆస్తుల చిట్టా చూసి మొత్తం సిట్ అధికారులే విస్తు పోయారు. ఒక పిఏ సాధారణ జర్నలిస్టు జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు వరకు ద్విచక్ర వాహనంలో తిరుగుతున్న తిరిగిన వ్యక్తి. ఒక్కసారిగా వందల ఎకరాలు భూములు, ఆస్తులు, వాహనాలు సంపాదించారంటే ఏ స్థాయిలో అధికార దుర్వినియోగం జరిగిందో ఒకసారి అర్థం చేసుకోవచ్చు. ?సాక్షాత్తు ఒక ముఖ్యమంత్రి పిఏ ఈ విధంగా వందల కోట్లలో లిక్కర్ స్కామ్ లో సంపాదించి ప్రజల జీవితంతో చెలగాటమాడుతుంటే ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్ మోహన్ రెడ్డి మరియు ఆయన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి ఎన్ని వందల కోట్లు సంపాదించి ఉంటారు ఒకసారి జనాలు కూడా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విధంగా లిక్కర్ స్కాం లో కోట్లాది రూపాయలు సంపాదించిన ఈ గజదొంగలు ముఠా విదేశాలలో, విలాసాలకు, స్పెషల్ ఫ్లైట్ లకు ఖర్చులు పెట్టి, విదేశాలలో కులుకుతుంటే వీళ్ళు అమ్మినటువంటి ఈ చీప్ లిక్కర్ తాగిన సామాన్య ప్రజలు తమ లివర్లను, కిడ్నీలను, పోగొట్టుకొని అనారోగ్యం పాలయ్యారు. వీళ్ళ యొక్క ఉసురు జగన్మోహన్ రెడ్డికి ,సజ్జల రామకృష్ణారెడ్డికి, ఈ లిక్కర్ స్కామ్ నిందితులకి తగలకపోదు. త్వరలో సజ్జల రామకృష్ణారెడ్డి, జగన్మోహన్ రెడ్డి యొక్క అరెస్టు కూడా తథ్యం. లిక్కర్ స్కామ్ లో కోట్లాది రూపాయలు దోచుకున్న ఈ గజదొంగల ముఠా ఏమాత్రం పశ్చాత్తాపం పడటం లేదు. తాము ఏదో పెద్ద స్వాతంత్ర సమరయోధులని, ప్రజల కోసం పోరాటం చేసిన వీరులని, డబ్బాలు కొట్టుకుంటున్నారు. పైగా వీరికి మద్దతుగా జగన్మోహన్ రెడ్డి క్యాబినెట్లో పనిచేసిన మంత్రులు ప్రెస్ మీట్ లు పెట్టడం విడ్డూరంగా ఉంది, అని టిడిపి నాయకులు ధ్వజమెత్తారు. ఈ యొక్క ప్రెస్ మీట్ లో టిడిపి కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, చిత్తూర్ రూరల్ టిడిపి నాయకుడు యువరాజు నాయుడు మరియు టిడిపి మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ పాల్గొన్నారు.

15 ఏళ్లే మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

వీరన్నపాలెంలో నూతన మంచినీటి ట్యాంకులను ప్రారంభించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

బుట్టాయిగూడెం (సంధ్య ఉష శ్రీ) మే 30 మండల పరిధిలోని వీరన్నపాలెం గ్రామంలో దశాబ్దకాలంగా కొనసాగుతున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకులను పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు శనివారం ప్రారంభించారు. గ్రామ ప్రజలు తమకు త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన అధికారులతో సమన్వయం చేసి కేవలం వారం రోజుల వ్యవధిలోనే త్రాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం విశేషం. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు గ్రామస్థులు, మహిళలు, యువకులు ఘన స్వాగతం పలికి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. నూతన మంచినీటి ట్యాంకులను ప్రారంభించిన అనంతరం గ్రామ ప్రజలతో సమావేశమై వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలు సంతోషంగా, ఆరోగ్యంగా జీవించేలా తాగునీరు, రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించడం ప్రజాప్రతినిధు ల బాధ్యత అని, వీరన్నపాలెం గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారం అందుకు నిదర్శనమని అన్నారు. అలాగే గ్రామంలో ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ నిరుపేద వ్యక్తికి ఎమ్మెల్యే స్వయంగా ఆర్థిక సహాయం అందజేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు. గ్రామ యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షిస్తూ క్రికెట్ కిట్ కొనుగోలుకు నగదు సహాయం అందించారు. యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. పోలవరం నియోజకవర్గంలోని ప్రతి గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోవిందరెడ్డిపల్లి చెక్‌డ్యాం వద్ద అక్రమ ఇసుక తవ్వకాలపై పోలీసులు ఉక్కుపాదం

నలుగురు అరెస్ట్.. మూడు టిప్పర్లు, హిటాచి యంత్రం స్వాధీనం

తవణంపల్లె (ఉష శ్రీ) మే30 మండలంలోని గోవిందరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని పిల్లవంక, చెక్‌డ్యాం ప్రాంతంలో అక్రమ ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్న ముఠాపై తవణంపల్లె పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి ఆధీనంలో ఉన్న మూడు టిప్పర్ లారీలు, ఒక హిటాచి యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు, గోవిందరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని పిల్లవంక, చెక్‌డ్యాం ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తవ్వి, బెంగళూరు సరిహద్దు ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇసుకతో లోడ్ చేసిన అశోక్ లేలాండ్ టిప్పర్‌ను నడుపుతున్న బి. బాబు (43)ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే టాటా టిప్పర్ డ్రైవర్ ఆర్. మధు నాయుడు (41), భారత్ బెంజ్ టిప్పర్ డ్రైవర్ వి. గిరి (31)లను కూడా అరెస్ట్ చేశారు. వీరి వాహనాలు అక్రమ ఇసుక రవాణాకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. టిప్పర్లలో ఇసుక లోడ్ చేస్తున్న హిటాచి యంత్రం డ్రైవర్ నితీష్ కుమార్ (31)ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ అక్రమ ఇసుక తవ్వకాల వెనుక బంగారుపాళ్యం మండలానికి చెందిన హరిప్రసాద్ నాయుడు కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో తేలింది. అతడే మూడు టిప్పర్లు, హిటాచి యంత్రానికి యజమానిగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై తవణంపల్లె పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.35/2026గా కేసు నమోదు చేసి, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 303(2), ఎంఎండీఆర్ చట్టం-1957లోని సెక్షన్ 21(1), 21(4) కింద కేసు నమోదు చేశారు. అరెస్టు చేసిన నలుగురిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా, స్వాధీనం చేసుకున్న వాహనాలు, యంత్రాన్ని సీజ్ చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

యువత క్రీడల్లో జోష్ గా.. చెడు వ్యసనాలకు దూరంగా...

- ఎమ్మెల్యే కందికుంట పిలుపు
- ప్రతి పౌరుడికి చట్టాలపై అవగాహన అవసరం.. నేరాల నివారణే పోలీసుల ప్రధాన లక్ష్యం
- జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్

కదిరి (ఉష శ్రీ) మే 30 : యువత క్రీడల్లో హుషారుగా ఉంటూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంతో పాటు చట్టాలపై అవగాహన కల్పించి బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడం పోలీసు శాఖ లక్ష్యమని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎస్. సతీష్ కుమార్ అన్నారు. అవగాహన కార్యక్రమాలు మరియు ప్రజల భాగస్వామ్యంతో నేరాలను ముందుగానే నివారించడం జిల్లా పోలీసుల ప్రధాన ప్రాధాన్యత అని పేర్కొన్నారు. కదిరి సబ్ డివిజన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఫ్రెండ్లీ పోలీస్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి జిల్లా ఎస్పీతో పాటు కదిరి ఎమ్మెల్యే శ్రీ కందికుంట వెంకట ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ, ఎమ్మెల్యే జట్ల మధ్య జరిగిన స్నేహపూర్వక మ్యాచ్ క్రీడాకారులు, ప్రేక్షకులను ఆకట్టుకుంది. వారం రోజుల పాటు నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో కదిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 16 జట్లు పాల్గొన్నాయి. విజేత కే జి ఎఫ్ జట్టు రూ.25వేలు నగదు బహుమతి, రన్నర్ కప్ ఆర్డిటి క్యాంపు జట్టుకు రూ.15వేలు నగదు బహుమతిని అందజేశారు.

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ:- డ్రగ్స్ దుర్వినియోగం, సైబర్ నేరాలు, మహిళలు మరియు బాలల భద్రత, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగం, చట్టపరమైన అంశాలపై యువతలో అవగాహన పెంపొందించేందుకు ఈ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల కొందరు యువకులు అనుకోకుండా నేరాలలో చిక్కుకుంటున్నారని ఇది వారి భవిష్యత్తు, ముఖ్యంగా ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల వినియోగం, రవాణా మరియు విక్రయాలకు సంబంధించిన నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే మైనర్లపై జరిగే నేరాలకు పోక్సో చట్టం కింద తీవ్రమైన శిక్షలు విధించబడతాయని తెలిపారు. నేరాల స్వరూపం, శిక్షలు, చట్టపరమైన పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ:- క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. నేరాల నివారణ, చట్టాలపై అవగాహన పెంపు కోసం పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివ నారాయణ స్వామి, సీఐలు డి.వి. నారాయణ రెడ్డి, జి. నిరంజన్ రెడ్డి, నాగేంద్ర, ఎస్సైలు బాబ్జాన్, మక్బూల్, ధనుంజయ రెడ్డి, చెన్నయ్య, దిలీప్ కుమార్, కృష్ణమూర్తి, సుమతి, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం..యువతి ఆత్మహత్య, ప్రియుడిపై కేసు నమోదు

తవణంపల్లె (ఉష శ్రీ) మే 30 మండల పరిధిలోని చారాల హెచ్‌డబ్ల్యూ గ్రామంలో ప్రేమ వ్యవహారం విషాదాంతమైంది. వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చి చివరకు నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు, చారాల హెచ్‌డబ్ల్యూ గ్రామానికి చెందిన కావ్య (24) అదే గ్రామానికి చెందిన త్యాగరాజ్ కుమారుడు విక్కీతో గత ఆరు నెలలుగా ప్రేమ సంబంధం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో విక్కీ తనను తప్పకుండా వివాహం చేసుకుంటానని కావ్యకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. అయితే ఇటీవల వివాహం విషయమై కావ్య పలుమార్లు ఒత్తిడి చేయగా, నిందితుడు వివిధ కారణాలు చెబుతూ ఆ విషయాన్ని వాయిదా వేస్తూ వచ్చాడని సమాచారం. శనివారం ఉదయం కూడా వివాహం గురించి ప్రశ్నించగా, ప్రస్తుతం తాను ఆమెను వివాహం చేసుకోలేనని, తనకు నచ్చినట్లు చేసుకోవచ్చని, చనిపోవాలనుకుంటే చనిపోవచ్చని చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కావ్య ఇంట్లోని పైకప్పు హుక్‌కు దుపట్టాతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ?కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆమెను ఉరి స్థితి నుంచి దించి అరగొండలోని అపోలో ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి ఆర్. సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

ఎస్సై దూషించాడంటూ మహిళా ఆత్మహత్యాయత్నం

- పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ
- ప్రత్యర్థుల వద్ద లంచం తీసుకొని తమను అవమానించారు అంటున్న బాధిత కుటుంబ సభ్యులు

కదిరి (ఉష శ్రీ) మే 30 తలుపుల మండల పరిధిలోని ఉడుమలకుర్తి గ్రామం సోమలవాండ్లపల్లి కి చెందిన వై.మమతా శనివారం ఎస్ఐ దూషించాడు అంటూ మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకున్న ఘటన వెలుగు చూసింది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన కదిరి ఏరియా ఆసుపత్రి కి తీసుకోచ్చారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు ఓ కేసు విషయమై అదే గ్రామానికి చెందిన ఇరువురు స్టేషన్ కు పిలిపించిన ఎస్ఐ చెన్నయ్య నన్ని ల...కారాలతో దుర్భాషలాడారని ఆరోపించింది. ఎందుకు సార్ ఇలా తిడుతున్నావ్ అని ప్రశ్నించగా నీకు దిక్కున్న చోట చెప్పుకో అంటూ అవమానపరిచారని న్యాయం కోరగా బెదిరింపులకు గురి చేశారని బాధితురాలు ఆరోపించింది. మాకు న్యాయం చేయకపోతే ఏమైనా చేసుకోవాలి అనగా ఏమైనా చేసుకొని చావు అన్నాడని తెలిపారు. ప్రత్యర్థుల దగ్గర లంచం తీసుకుని మమ్మల్ని దూషించారంటూ ఫిర్యాదురాలు కన్నీరు మున్నీరు అయింది. జరగరానిది జరిగింటే మా కుటుంబం రోడ్డున పడేదని బాధితురాలి భర్త అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విచారించి ఎస్సై పై తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఈ ఆరోపణలపై పోలీసుల అధికారిగా స్పందన రావాల్సి ఉంది.

గుగూడు కుల్లాయి స్వామి బ్రహ్మోత్సవాలపై సమీక్ష

శింగనమల/ నార్పల (ఉష శ్రీ) మే 30 క్తుల సౌకర్యార్థం ప్రతి అధికారి పనిచేయాలని శింగనమల శాసన సభ్యులు బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు. పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ కుల్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు జూన్ 17వ తేదీ నుండి ప్రారంభమవుతున్న సందర్భంగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పై ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏడాది జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుండి యాత్రికులు లక్షలాదిగా కుల్లాయి స్వామి దర్శనానికి వస్తారని. స్వామివారి దర్శనానికి వచ్చిన ప్రజలు మొదటగా ఆంజనేయ స్వామిని దర్శించుకుని కుల్లాయ స్వామిని దర్శించుకుంటారు. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టాలైన చిన్న సరిగెత్తు, పెద్ద సరిగెత్తు, అగ్నిగుండ ప్రవేశం రోజున స్వామి దర్శనానికి జనాలు భారీ ఎత్తున తరలివస్తారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నాలుగో రోజు నుండి కుల్లాయి స్వామి ఆలయం ఎదుట అగ్నిగుండం మండుతూ ఉంటుంది. కుల్లాయి స్వామి ఆలయంలోకి మహిళకు ప్రవేశం లేకపోవడంతో బయట నుండే కుల్లాయి స్వామి దర్శనం తోపాటు అగ్నిగుండం సెగతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక ఎవరైనా వీఐపీలు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు దర్శనానికి వస్తే క్యూ లైన్ లో యాత్రికులకు ఇబ్బందులు రాకుండా విఐపిల రాకపోకలు యాత్రికులకు ఇబ్బందులు కలగకూడదని స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అధికారులతో చెప్పారు. ఈ ఏడాదైనా కుళాయి స్వామి బ్రహ్మోత్సవాల్లో ఆలయ పరిసరాల్లో ఉన్న స్థలంలోనే మహిళల కోసం ప్రత్యేకమైన క్యూ లైన్ ఏర్పాటు చేయాలని పలువురు మహిళా యాత్రికులు కోరుతున్నారు. కుల్లాయి స్వామి బ్రహ్మోత్సవాల పై ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, క్యూ లైన్ల ఏర్పాటు చలువ పందిల్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, విడిది ప్రాంతాలు, పోలీస్ బందోబస్తు, ప్రత్యేక బస్సులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

సమాచార పౌర సంబంధాల శాఖలో ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్‌గా సేవలందించిన యం. వెంకటరత్నం పదవి విరమణ

చిత్తూరు (ఉష శ్రీ) మే 30 విధుల పట్ల పలువురికి మార్గదర్శకంగా ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్ ఎం.వెంకటరత్నం నిలిచాడని ఐ అండ్ పి ఆర్ ఏ డి వేలాయుధం పేర్కొన్నారు. శనివారం పదవి విరమణ సందర్భంగా జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్‌గా సేవలందించిన యం. వెంకటరత్నం పదవీ విరమణ పొందారు. స్థానిక కలెక్టరేట్లోని డ్వామా కార్యాలయం లోని సమావేశ మందిరంలో సమాచార పౌర సంబంధాల శాఖలో ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహించిన యం. వెంకటరత్నం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా శాఖాధికారులు, సహోద్యోగులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిడి మాట్లాడుతూ వెంకటరత్నం తన ఉద్యోగ కాలంలో క్రమశిక్షణ, అంకితభావం, నిబద్ధతతో విధులు నిర్వహించి శాఖ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. సమాచార సాంకేతిక సేవల నిర్వహణలో ఆయన చూపిన ప్రతిభ, సహోద్యోగులతో కలసి పనిచేసిన తీరును ప్రశంసించారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాఖ సిబ్బంది, సహోద్యోగులు పాల్గొని వెంకటరత్నం ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డిఐపిఆర్ఓ, గురు స్వామి శెట్టి, ఇతర అధికారులు, సిబ్బంది, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED, OWNED BY ILIPILLA MOHAN, D.NO: 6-11-2, KILARI APPALASWAMI STREET, NAGA LAKSHMI NILYAM, ANJANEYAVAGUSENTAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH- 520001, PRINTED AT GANTYADA APPA RAO D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH-523001 P.H: 92950 03377,EMAIL: ushasri2025@gmail.com,RNI NO: APTEL/25/A4894,EDITOR: ILLIPILLA MOHAN